# జూనియర్ అధ్యాపకుల తెలుగు కరదీపిక

# మొదటి సంవత్సరం

పద్యభాగం, గద్యభాగం,

మరియు

ఉపవాచకం, వ్యాకరణం(తెలుగు సంధులు, సమాసాలు)

## ఇంటర్మీడియట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్

పుట్టుక దగ్గర, చావు దగ్గర పరభాషలో నవ్వలేను, ఏడ్వలేను.

- కొంక్యాన ఛాయరాజ్

తే|| పుట్టి నాడవు దివ్యాంధ్ర పుణ్య భూమి
పావనంబగు ఋషుల యన్వయమునందు
ఎల్ల విధముల ప్రాణంబులిచ్చియైన
లెమ్మునీభాష రక్షించుకొమ్మువత్స!

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

## తెలుగు కరదీపికను తయారు చేసిన వారు

1. డా. మొయిద హనుమంతరావు
ప్రిన్సిపల్
ప్రభుత్వ జూనియర్ కళాశాల
పూసపాటిరేగ, విజయనగరం జిల్లా

2. శ్రీ పూషడపు సుబ్బారావు
జూనియర్ లెక్చరర్
ప్రభుత్వ జూనియర్ కళాశాల
అవనిగడ్డ,కృష్ణా జిల్లా

## **అధ్యాపకులకు నమస్కారములు**

# విషయసూచిక

## సాహితీసౌరభం


**పద్యభాగం**

| | | |
|---|---|---|
| 1. భీముని గర్వభంగం | - | నన్నయ |
| 2. రుద్రపశుపతి కథ | - | పాల్కురికి సోమనాథుడు |
| 3. మంచిముత్యాలు | - | వివిధ కవులు |
| 4. బాటసారి | - | శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) |
| 5. ఆంధ్రుడను | - | గుఱ్ఱం జాషువా |

**గద్యభాగం**

| | | |
|---|---|---|
| 1.మహాత్మా జ్యోతిబాపులే | - | డా॥ బి. విజయభారతి |
| 2.జాయసేనాపతి | - | రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ |
| 3.సి.పి. బ్రౌన్ | - | జానుమద్ది హనుమచ్ఛాస్త్రి |
| 4.జానపద కళలు | - | మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి |
| 5. దొంగ ఎవడు? దొర ఎవడు? | - | తాపీ ధర్మారావు |

**ఉపవాచకం (కథా కదంబం)**

| | | |
|---|---|---|
| 1. గౌరవస్థానం | - | కనుపర్తి వరలక్ష్మమ్మ |
| 2.ఉరి | - | విశ్వనాథ సత్యనారాయణ |
| 3.గాలివాన(పాటకథ) | - | అడవి బాపిరాజు |
| 4.వానకురిస్తే | - | కేతు విశ్వనాథరెడ్డి |
| 5. మహామనిషి రతన్ టాటా | - | పాఠ్యగ్రంథ రచయితలు |

**వ్యాకరణం**

1. సంధులు
2. సమాసాలు
3. పదదోషాలు

# 1. భీముని గర్వభంగం

- నన్నయ

## పద్యభావములు

**1. క్షత్త్రియప్రవరుండ విఖ్యాతబలుడ............ భీముడండ్రు భూజనులు కపిప్రభుండ!**

**కవిపరిచయం :** ఈ పద్యం నన్నయ భట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వం తృతీయాశ్వాసంనుండి గ్రహించబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**భావం :** “కోతులకు రాజు అయినవాడా! నేను క్షత్రియులలో శ్రేష్ఠుడిని. మహావీరుడిగా ప్రసిద్ధి చెందినవాడిని. పాండు మహారాజు యొక్క కుమారుడిని. వాయుదేవుని వర ప్రసాదమువలన కుంతీదేవికి జన్మించిన వాడిని. నన్ను ప్రజలంతా "భీముడు" అనే పేరుతో పిలుస్తారు.” అని భీముడు హనుమకు చెప్పుకున్నాడని భావం.

**2. ఏపున రెండు చేతులను నిమ్ముగ........ వృకోదరుండు దద్దయులజ్జనధోముఖంబుతోన్.**

**కవిపరిచయం :** ఈ పద్యం నన్నయ భట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వం తృతీయాశ్వాసంనుండి గ్రహించబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**భావం :** భీముడు ఉత్సాహంతో తన బలాన్ని అంతా ఉపయోగించి రెండు చేతులతో హనుమంతుడి తోకను గట్టిగా పట్టుకుని కదిలించేప్రయత్నం చేశాడు. కానీ అతడు తోకను కదల్చలేక చతికిలపడ్డాడు. అతని శరీరమంతా చెమటతో తడిసిపోయింది. అప్పుడు భీముడు అల్పమానవుడి వలె గర్వాన్ని విడిచిపెట్టి, చింతిస్తూ, సిగ్గుతో తలవంచుకుని నిలబడినాడు అని భావం .

**3. అతులితమై ద్వితీయ కనకాద్రి .................. మారుతి కిట్లనియెన్ భయంబునన్**

**కవిపరిచయం :** ఈ పద్యం నన్నయ భట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వం తృతీయాశ్వాసంనుండి గ్రహించబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**భావము :** సాటి లేనటువంటి హనుమ రూపం రెండవ బంగారు కొండ (మేరు పర్వతం) అన్నట్లుగా ఉంది.ఆయన తన శరీరాన్ని పెద్దదిగా పెంచి, తన తోకతో దిక్కుల చివరి అంచులను తాకుతున్నాడు. అతని నిజమైన స్వరూపాన్ని చూసిన కురువంశకుమారుడు అయిన భీముడు కన్నులు మూసుకున్నాడు. తన మనసులో మిక్కిలి ఆశ్చర్యం పొందినవాడైన భీముడు భయపడి హనుమతో ఈ విధంగా అన్నాడు అని భావం.

4. **ఉన్నతి బూని నీవు .................... నాజివధించుట యేమి చోద్యమే**

**కవిపరిచయం** : ఈ పద్యం నన్నయ భట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని అరణ్యపర్వం తృతీయాశ్వాసంనుండి గ్రహించబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**భావము** : భీముడు ఆంజనేయుడితో" నీవు గొప్ప బలశాలివి. నీవు పూనిక వహించి అమిత బలవంతుడైన రావణాసురుడిని శ్రమలేకుండా యుద్ధంలో సం హరించ గలవాడవు. అంటు వంటి గొప్ప శక్తిమంతుడువైన నిన్ను సహాయకునిగా స్వీకరించి, నిర్మలమనస్కుడు, నీతిమంతుడు అయిన రఘురాముడు నరమాంస భక్షకులైన రాక్షసులను యుద్ధంలో చంపటం అనేది ఏమంత వింతకాదు" అని పలికినాడు అని భావం.

## I. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

### 1. హమమంతుడు భీమునికి తెలిపిన నాలుగు యుగధర్మములను వివరించండి.

ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్య పర్వంలోని తృతీయాశ్వాసం నుండి "భీమని గర్వభంగం అను పాఠ్యభాగమును గ్రహించారు. గర్వభంగంతో చతికిలపడ్డ భీముడు వానరునిగా కనిపిస్తున్న ఓ ఆంజనేయా! నా మీద దయ ఉన్నట్లయితే ఆనాడు నీవు సముద్రాన్ని దాటిన ఆకారాన్ని నేడు నాకు చూపుము" అని అడిగాడు.అపుడు హనుమ సముద్రాన్ని దాటేసమయంలోని ఆ ఆకారాన్ని ఈ సమయంలో ప్రదర్శించడం ఏ విధంగా వీలుపడుతుంది. కాలం ఎప్పుడూ ఏకరీతిన ఉండదు. పలువిధాలు గా మార్పు చెందుతుంది. ఆకారణంచేత నాలుగుయుగాలు కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు భిన్నమైనవి" అని బదులిచ్చాడు . అప్పుడు భీముడు ఆయాయుగాలలోని ప్రజల గుణములు, ధర్మాచరణను నాకు వివరించి చెప్పవలసింది అని, ప్రార్థించగా హనుమ ఈ విధంగా వివరించాడు. ఓ భీమా! కృతయుగంలో చేయటమేకాని, చేయవలసినది ఏమీ ఉండదు. ఈ యుగంలో ధర్మం నాలుగు పాదాలలో వర్ధిల్లుతుంది. విష్ణుమూర్తి తెలుపురంగు కలవాడై ప్రజలను కాపాడతాడు. ఈ యుగంలో శాశ్వతమైన ధర్మం ఉంటుంది బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య-శూద్రులు అందరూ వేదం నిర్దేశించిన పనులు చేసేందుకు అర్హత కల్గి ఉంటారు. ఉత్తమ గతులు పొందుతారు, పగ, కోపం, గర్వం, దుఃఖం రోగం, లోభం, జననాశనం వంటివి ఉండవు. ఇక త్రేతాయుగంలో ధర్మం మూడు పాదాలలో వర్ధిల్లుతుంది ఈ యగంలో ప్రజలు నిత్యమూ సత్యమునే చెబుతారు. యజ్ఞాలు, తపస్సు, దానంచేయటం మొదలగు వాటియందు శ్రద్ధ చూపుదురు. ఈ యుగంలో విష్ణుమూర్తి ఎర్రటి రంగు కలవాడై ప్రజలను కాపాడతాడు.

మూడవదైన ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాలలోనే వర్ధిల్లుతుంది. ప్రజలు నిజం మాట్లాడరు. అంతరింద్రియ నిగ్రహాన్ని కోల్పోతారు. కోరికలపట్ల ఆసక్తి కలవారై పెక్కు యాజ్ఞాలు నిర్వహిస్తారు. ఈయుగంలో విష్ణుమూర్తి నీలిరంగు కలవాడై జగత్తును కాపాడుతాడు.

నాల్గవదైన కలియుగంలో ధర్మం ప్రాధాన్యత తగ్గి ఒక పాదాన వర్ధిల్లుతుంది. అందు విష్ణుమూర్తి పసుపు రంగు కలవాడై ప్రపంచాన్ని కాపాడును. ఈ కలియుగంలో ప్రజలు కామం, క్రోధము, మోహము, మదము, మాత్సర్యము,లోభం మొదలైన ఆరు దుర్గుణాలు (అరిషడ్వర్గాలు) అలవర్చుకుని అధర్మమార్గంలో నడుస్తారు. కానీ ఈ యుగంలో చేసిన తపము, దానములు మొదలైన కార్యములు తక్కువ చేసినా ఎక్కువ ఫలితాలు ఇస్తాయి.అని హనుమ భీముని కి నాలుగు యుగాల తీరుతెన్నులు వివరించాడు.

**2. భీముని గర్వ భంగ వృత్తాంతాన్ని తెల్పండి.**

ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలోని తృతీయాశ్వాసం నుండి "భీముని గర్వభంగం" అనే ఈ పాఠ్యభాగాన్ని గ్రహించారు.

భీముడు కుంతీదేవికి, వాయుదేవుని వరప్రసాదం వల్ల జన్మించాడు. పాండవ మధ్యముడు, అమిత బలశాలి. ద్రౌపదికోరిక మేరకు సువాసనాభరితమైన సౌగంధికా పుష్పాలు తెచ్చేందుకు ఆయుధధారియై గంధమాదన పర్వత ప్రాంతాల్లో సంచరిస్తున్నాడు. ఎదురొచ్చిన సింహాలని, ఏనుగులను విసిరి వేశాడు. అడ్డువచ్చిన చెట్లును కూల్చివేస్తూ శంఖనాదం చేశాడు. ఆ ధ్వనికి గంధమాదన పర్వతంలోని ఒక గుహలో నిద్రిస్తున్న హనుమంతుడు ఉలిక్కిపడి మేల్కొన్నాడు. "ఇది నా సోదరుని శంఖారావమే" అని భావించి మనసులో సంతోషించాడు.భీముడు వచ్చే మార్గంలో పెద్ద పెద్ద చెట్లను పెకలించిన హనుమ దారికి అడ్డుగా అటు - ఇటు వేశాడు. ఇరుకైన కాలిబాటలో ఒక్కరుమాత్రమే వెళ్ళేందుకు దారి ఉంచి, దానికి అడ్డుగా తనతోకను ఉంచి, సమీపంలోని శిలపై హనుమ నిద్రించాడు. హనుమ నిద్ర చెడగొట్టేందుకు భీముడు పెద్ద సింహనాదం చేశాడు . హనుమ మేల్కొని "ముసలితనంలో వచ్చే వ్యాధులవలన అలసి ఒక మూలన నిద్రిస్తున్నాను. నీవుమిక్కిలి గర్వముతో నానిద్ర ఎందుకు పాడుచేశావు? మావంటి అల్పజీవుల పట్ల దయలేకుండా ఎందుకు గర్జిస్తున్నావు? అతిలోక శక్తులు కల మనుషులు తప్ప ఈ అడవిలో ఎవరూ తిరగలేరు. అమృతతుల్యమైన ఈ పండ్లు గ్రహించి ఇక్కడినుండి వెళ్ళిపో " అని భీమునితో పలికాడు. అప్పుడు భీముడు గర్వంతో " నేను క్షత్రియ శ్రేష్ఠుడిని. మహావీరుడను నన్ను' భీముడు' అంటారు . నేనొక ముఖ్యమైన పనిమీద వెళ్తున్నాను. నాకు దారి విడువు. దారి విడవకపోతే నిన్ను, ఈ కొండను అవలీలగా దూకి దాటి పోగలను. నేను హనుమంతుడితో సమానమైన శక్తి శౌర్యాలు కలవాడిని . నా బలాన్ని ప్రదర్శించ మంటావా? అని భీముడు పలికాడు. హనుమ తన ముఖంలో చిరునవ్వు కనిపించకుండా అణుచుకుని" నేను ముసలివాడిని కదా! కదలలేను. నీవు ముందుకువెళ్ళదలిస్తే నాతోకను కొద్దిగా అవతలికి నెట్టి వెళ్ళు" అని చెప్పెను . భీముడు నిర్లక్ష్యంగా తనఎడమ చేతితో తోకను నెట్టబోయాడు. అణుమాత్రం కూడా కదపలేక పోయాడు. అప్పుడు తనరెండు చేతులతో బలాన్ని అంతా ఉపయోగించి తోకను కదిలించేందుకు విశ్వప్రయత్నం చేశాడు. అతని శరీరమంతా

చెమటతో తడిసిపోయింది కానీ తోకను మాత్రం కదపలేక పోయాడు. అప్పుడు భీముడు అల్పమానవునివలె గర్వమును వీడి, సిగ్గుతో హనుమ ముందు తలవంచుకుని నిలబడ్డాడు.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. భీముని శంఖారావం విన్న హనుమంతుడు ఏమిచేశాడు?**

**జ:** భీముని శంఖనాదం విన్న హనుమంతుడు ఉలిక్కిపడి మేల్కొన్నాడు. "ఇది మనసుకు ఆనందం కలిగిస్తున్నది. ఇది నా సోదరుని శంఖధ్వనియే" అని సంతోషంతో హనుమ ఉప్పొంగిపోయాడు. భీముడు ముందుకు వెళ్ళేందుకు వీలులేకుండా దారికి అటూ ఇటూ అడ్డంగా పెద్ద చెట్లను పెకిలించి వేశాడు. ఇరుకైనదారిలో ఒకరుమాత్రమే నడిచేందుకు వీలైన కాలిబాటకు అడ్డంగా తన తోకను ఉంచి సమీపంలోని శిలపై హనుమనిద్రించాడు

**2. భీముడు తన గొప్పతనాన్ని ఎలా చెప్పుకున్నాడు?**

**జ:** "నేను క్షత్రియులలో శ్రేష్ఠుడిని.గొప్ప బలసంపన్నుడను.పాండుమహారాజు కుమారుడిని. కుంతి గర్భమున వాయుదేవుని వరప్రసాదం వలన జన్మించినవాడను,నన్ను "భీముడు" అని ప్రజలంతా పిలుస్తారు. నేనొక పనిమీద వెళ్తున్నాను. నాకు దారివిడువుము. విడవకపోతే నిన్ను, ఈ కొండను అవలీలగా దూకి దాటిపోగలను" అని భీముడు తన గొప్ప తనాన్ని హనుమతో చెప్పాడు.

**3. హనుమంతుని నిజస్వరూపాన్ని చూసిన భీముడు ఏమన్నాడు?**

**జ:** హనుమంతుని నిజస్వరూపాన్ని చూసి భీముడు కన్నులు మూసుకుని, మనసులో ఆశ్చర్యపడుతూ భయంతో మారుతికి ఇట్లా విన్నవించుకున్నాడు. " "ఓహో! ఇది మిక్కిలి భయం కలిగించేటువంటిది. ఆశ్చర్యాన్ని కలిగించేటువంటిది. నీ శరీరం యొక్క నిడివి భూమి, ఆకాశం మధ్యభాగాన్నంతా ఆక్రమించింది. ఈ నీయొక్క నిజస్వరూపాన్ని దయచేసి ఉపసంహరించ-వలసినది"అని భీముడు వేడుకున్నాడు.

**4. హనుమంతుడు భీమునికి తెల్పిన చతుర్విధ ఉపాయాలను తెల్పండి.**

**జ:** ఏపనిని అయినా నెరవేర్చేందుకు బుద్ధిమంతులు సాహసాన్ని వదిలి,సామ -దాన - భేద - దండం అనే నాలుగు ఉపాయాలను ఏవిధంగా ప్రయోగించదగునో అట్లాగే ప్రయోగించి విజయం సాధిస్తారు. విజయసాధనకు హనుమ భీమునికి తెల్పిన నాలుగు ఉపాయాలు:

1. **సామం** = మంచిమాటలు చెప్పి, బుజ్జగించి నచ్చజెప్పటం
2. **దానం** = ఎదుటిపక్షంవారు కోరిన దానిని దానమివ్వడం
3. **భేదం** = శత్రువులలో చీలికలు తేవటం
4. **దండం** = బలాన్ని, పరాక్రమాన్ని చూపి శత్రువులను దండించడం.

**5. నన్నయ గురించి రాయండి.**

**జ:** నన్నయ సాధారణ శకం 11 వ శతాబ్ధమునకు చెందినవాడు.రాజమహేంద్రవరాన్ని రాజధానిగా వేంగిదేశాన్ని పాలించిన తూర్పుచాళుక్య రాజు అయిన రాజరాజనరేంద్రుని ఆస్థానకవి. నారాయణభట్టు సహాయంతో నన్నయ సంస్కృత వ్యాసభారతాన్ని తెలుగులోకి అనుసృజన చేశాడు అది - సభా - అరణ్యపర్వంలో సగభాగం వరకు రచన సాగింది. ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తినిధి నన్నయ కవితాగుణాలు. నన్నయకు ఆదికవి, శబ్దశాసనుడు లేదా వాగనుశాసనుడు అని బిరుదులు కలవు "ఆంధ్రశబ్దచింతామణి " అను తెలుగు వ్యాకరణాన్ని సంస్కృతంలో రచించారు.

## III. ఏకవాక్య/పద రూప సమాధాన ప్రశ్నలు

**1. భీముని గర్వభంగ పాఠ్యాంశం దేని నుండి గ్రహించబడింది ?**

**జ.** ఆంధ్రమహాభారతం

**2. భీముని గర్వభంగ పాఠ్యాంశం రచయిత ఎవరు ?**

**జ.** నన్నయ భట్టు

**3. భీముడు పుష్పాల కోసం ఎక్కడికి వెళ్ళాడు?**

**జ.** గంధమాదన పర్వత సమీప వనానికి

**4. దేవతలు దేనికి సంతృప్తులవుతారు?**

**జ.** హెూమములు, నమస్కారములు, భక్తిచేత

**5. హనుమంతుడు రణరంగంలో ఎక్కడ ఉండి యుద్ధాన్ని చూస్తానన్నాడు?**

**జ.** అర్జునుని రథం పైన జండా నుండి యుద్ధాన్ని చూస్తానన్నాడు.

**6. హనుమంతుడు భీమునికి మారువేషంలో ఎలా కనిపించాడు?**

**జ.** ముదుసలి కొండముచ్చు

## IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. క్షత్రియ ప్రవరుండ విఖ్యాత బలుడ, బాండు తనయుండ.**

**కవిపరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలోని తృతీయాశ్వాసంనుండి గ్రహింపబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది

**సందర్భం :** మానవ మాత్రులు రాలేని ఈ వనానికి నీవెలావచ్చావని హనుమ అడిగితే భీముడు పలికిన సందర్భములోనిదీ వాక్యం.

**భావం :** "నేను క్షత్రియులలో శ్రేష్ఠుడిని గొప్ప బలసంపన్నుడను. పాండుమహారాజు కుమారుడిని. కుంతి గర్భమున వాయుదేవుని వరప్రసాదం వలన జన్మించిన వాడను. నన్ను "భీముడు" అని ప్రజలంతా పిలుస్తారు" అని భీముడు హనుమతో పలికినాడ భావం.

**2. మహానాదంబిది మనః ప్రియంబయ్యె**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలోని తృతీయాశ్వాసంనుండి గ్రహింపబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది

**సందర్భం:** భీముడు చేసిన శంఖధ్వనికి హనుమంతుడు ఉలిక్కిపడి లేచిన సందర్భంలోనిదీ వాక్యం.

**భావం:** .భీముని శంఖనాదం విన్న హనుమంతుడు " ఇది చాలా గొప్ప నాదం. నామనసుకు ఆనందాన్ని కల్గిస్తుంది. ఇది నా సోదరుడి శంఖనాదమే" అని హనుమ తనలో తాను అనుకున్నాడని భావం

**3. ఇంతయుం గపినాథ! నీకిదియేమిపెద్ద?**

**కవిపరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలోని తృతీయాశ్వాసంనుండి గ్రహింపబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** "మీ శత్రువులను నేను ఒక్కడివే యుద్ధంలో సంహరించి నీకు సంతోషం కలిగించగలను" అన్న హనుమతో భీముడు పలికిన సందర్భంలోనిదీ వాక్యం..

**భావం :** " ఓ వానర శ్రేష్టుడా! నీవు ఒక్కడివే అసహాయుడివై మా శత్రువులందరినీ యుద్ధంలో సంహరించగలవు. ఇది నీకొక ఘన కార్యమా? మీదయ వలన మేము జయించలేని వీరులు ఈ భూమ్మీద ఎవ్వరూ లేరు" అని భీముడు పలికినాడని భావం.

**4. సిద్ధుండవో, గంధర్వుండవో నా కెఱింగింపు.**

**కవిపరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలోని తృతీయాశ్వాసంనుండి గ్రహింపబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** బలగర్వభంగం చెందిన భీముడు హనుమతో పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

**భావం :** హనుమ వాలము (తోక) ను కదలించలేని భీముడు నమస్కరించి "తెలియక నీ ముందు గర్వంగా మాట్లాడినందుకు క్షమించు. నీవు కోతి ఆకృతి దాల్చిన సిద్ధుడివో!, గంధర్వుడివో! దేవశ్రేష్ఠుడివో ! నాకు తెలియ జేయుము " అని హనుమతో పలికినాడని భావం.

**5. శుక్లవర్ణుడై ప్రజల గాచుచు వెలుంగు**

**కవిపరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలోని తృతీయాశ్వాసంనుండి గ్రహింపబడిన "భీముని గర్వభంగం" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** యుగధర్మములు తెలపమన్న భీమునితో హనుమ పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

**భావము** : "కృతయుగం లో చేయటమేకాని, చేయవలసినది ఏమీ ఉండదు. ధర్మం నాలుగు పాదాలతో వర్ధిల్లుతుంది. శాశ్వతమైన ధర్మం ఉంటుంది. ప్రజలు ఉత్తమగతులు పొందుతారు. విష్ణుమూర్తి తెలుపు రంగు కలవాడై ప్రజలను కాపాడతాడు " అని హనుమ పలికినాడని భావం.

## సంధులు :

1 ప్రజల(గాచుచు = ప్రజలన్ + కాచుచు = సరళాదేశ సంధి

2 అత్యంత = అతి+అంత = యణాదేశ సంధి

3 నీకెల్లవారు = నీకు + ఎల్లవారు = ఉకార సంధి

4 కృతార్థుడు = కృత + అర్థుడు = సవర్ణదీర్ఘ సంధి

5 సీతాన్వేషణ = సీత+అన్వేషణ = సవర్ణదీర్ఘ సంధి

6 లంకేశ్వరుడు = లంక + ఈశ్వరుడు = గుణసంధి

7 కార్యార్థి = కార్య+అర్థి = సవర్ణదీర్ఘ సంధి

## సమాసములు :

1 శంఖధ్వానము = శంఖముయొక్క ధ్వానము = షష్ఠి తత్పురుష సమాసం

2 మహావృక్షము = గొప్పదైనవృక్షము = విశేషణ పూర్వపదకర్మధారయసమాసం

3 వనవాసి = వనమునందు వసించువారు = సప్తమీతత్పురుష సమాసం

4 శతయోజనాలు =వంద సంఖ్యకల యోజనాలు = ద్విగు సమాసం

5 వృకోదరుడు = వృకము ఉదరము వంటి ఉదరము కలవాడు (భీముడు) = బహువ్రీహిసమాసం

6 నిర్దయుడు = దయలేనివాడు = నఞ్ తత్పురుష సమాసం

7 స్ఫోటనరవం = స్ఫోటనము (తోక) కదపడంవలన కలిగే రవం (ధ్వని) = పంచమీ తత్పురుషసమాసం

8 కపినాధుడు = కపులకు నాధుడు = షష్ఠి తత్పురుష సమాసం

9 యక్షరాక్షసులు = యక్షులును, రాక్షసులును = ద్వంద్వసమాసం

10 రాజశాసనం = రాజు యొక్క శాసనం = షష్ఠితత్పురుష సమాసం

11 అలఘుడు = లఘువు కాని వాడు = నైఞతత్పురుష సమాసం

12 సీతాన్వేషణ = సీత కొరకు అన్వేషణ = చతుర్థి తత్పురుష సమాసం

13 భక్తిసాధ్యులు = భక్తి చేతసాధ్యులు = తృతీయాతత్పురుష సమాసం

14 సేతుబంధనం = సేతువును నిర్మించడం = ద్వితియా తత్పురుష సమాసం

# 2. రుద్రపశుపతి కథ

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు **పాల్కురికి సోమనాథుడు**

**1. శివుడు విషం తాగాడని రుద్రపశుపతి ఎలా దుఃఖించాడు?**

**జ.** తెలుగు సాహిత్యంలో శివకవియుగానికి నాయకుడైన పాల్కురికి సోమనాథుడు వ్రాసిన బసవపురాణంలో ఎందరో పురాతన శివభక్తులగురించిన గాథలున్నాయి. అందులో రుద్రపశుపతి కథ ఒకటి. రుద్రపశుపతి తన గ్రామంలో పౌరాణికుడు క్షీరసాగర మథన ఘట్టాన్ని చెబుతుండగా వినడానికి వెళ్ళాడు. శివుడు లోకాలను రక్షించడానికి హాలాహలం మింగాడన్న విషయాన్ని విన్నాడు. వెంటనే పెద్దగా ఏడుస్తూ "అయ్యో! శివుడు విషం తాగేశాడా! అంటూ నేలమీద పొర్లాడాడు. ఓ విశ్వేశా! నిన్ను వెఱ్ఱివాణ్ణిచేసి విషం తాగించారు. విషం తాగిన వారు ఎవరైనా బ్రతుకుతారా! నిన్నే నమ్ముకున్న నాలాంటి వారికి దిక్కెవరు? ఓపినాకీ! ఆ విషాన్ని బయటకు ఉమ్మివెయ్యి" అని వేదన చెందాడు.

"ఓ పార్వతిదేవి! ఓ ప్రమథగణముల్లారా! మీరంతా ఈ దారుణాన్ని ఎందుకు ఆపలేకపోయారు? ఓశ్రీహరీ! ఓ వీరభద్రా! ఓ శతరుద్రులారా! మన ప్రాణసమానుడైన పరమేశ్వరుడు విషం త్రాగుతుంటే ఎలా చూస్తూ ఊరుకున్నారు? నాశివుణ్ణి చావునుండి తప్పించండి. నా శివుడు తల్లి, దండ్రులు లేనివాడు. తల్లేఉంటే విషం త్రాగనిచ్చేదా? పరమశివునికి ఇట్టి ఆపద వచ్చిన తరువాత కూడా నేను బ్రతికిఉండడం వ్యర్థం. కనుక నేను ఈ మడుగులోనికి దూకి ప్రాణాలు విడుస్తాను." అంటూ రుద్రపశుపతి దు:ఖిస్తూ ప్రాణత్యాగం చేయడానికి బయలుదేరాడు.

**2. రుద్రపశుపతి ముగ్ధభక్తిని వివరించండి?**

**జ.** ముగ్ధ భక్తి అనగా స్వచ్ఛమైన, గాఢమైన, అమాయకపు భక్తి అని అర్థము. విశ్వేశ్వరుడు విషం తాగాడని తెలుసుకున్న ముగ్ధ భక్తుడైన రుద్రపశుపతి ఆందోళన చెంది ప్రాణాలు విడువబోయాడు. వెంటనే పార్వతీదేవి, ప్రమథగణాలు వెంటరాగా పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. వరమేమికావాలో కోరుకోమన్నాడు. అందుకు రుద్రపశుపతి నాకేమి కోరికలు లేవు. ముందు నీవు విషాన్ని బయటకు ఉమ్మివేయుమనిప్రార్థించాడు. అందుకు పశుపతి నవ్వుతూ ఆనాడు నేను హాలాహలం మింగినప్పుడు ఒక అణువంత నా కంఠమందు నిలిచింది. ఆ కాలకూటవిషము నన్నేమీ బాధించదని చెప్పాడు. అందుకు రుద్రపశుపతి ఓపినాకీ! ఇదంతా నేను నమ్మను. నీవు విషాన్ని ఉమ్మివేయకపోతే నేనిక్కడే చచ్చిపోతానని పట్టుపట్టాడు.

రుద్రపశుపతి ముగ్ధభక్తికి మెచ్చి శివుడు నిజంగానే హాలాహలాన్ని ఉమ్మివేస్తే తమతోపాటు సర్వలోకాలు మాడిపోతాయేమోనని విష్ణుమూర్తి మొదలైన దేవతలు గడగడలాడారు. అప్పుడు నాగభూషణుడైన పశుపతి రుద్రపశుపతిని లేవనెత్తి కౌగిట

చేర్చుకున్నాడు. నీవు నా తోడమీద కూర్చుని నా నీలకంఠాన్ని నేటినుండీ గమనిస్తూ ఉండమన్నాడు. శివుని గొంతులో హాలాహలం కొద్దిగా క్రిందకో - పైకో కదిలినా తాను కత్తితో పొడుచుకొని చనిపోతానని రుద్రపశుపతి శపథం చేశాడు. కనురెప్ప వాల్చకుండా పరమేశ్వరుని కంఠాన్ని చూస్తూ ఉండిపోయాడు.ఈ విధంగా రుద్రపశుపతి ముగ్ధభక్తిని మనం తెలుసుకోవచ్చు.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. విషం తాగిన శివుణ్ణి కాపాడమని రుద్రపశుపతి ఎవరెవరిని కోరాడు?**

**జ.** శివుడు విషం తాగాడని తెలుసుకున్న రుద్రపశుపతి పరిపరివిధాలా బాధపడ్డాడు.శివుడిని కాపాడమని ఎందరినో వేడుకున్నాడు. శివునిలో సగమైన గౌరి! నువ్వు ఎక్కడికి వెళ్ళావు? పరమ ఆప్తులైన ప్రమథగణాల్లారా! శివుడు మరణిస్తే మీరు బ్రతకగలరా? శతరుద్రులారా! పరమశివుని కాపాడండి. ఆయన విషము తాగాడు. ఏమవుతుందో? సద్గురు నాధుడైన శివునికి చావుతప్పించమని అందరినీ ప్రార్థించాడు.

**2. శివుడు రుద్రపశుపతికి ఇచ్చిన వరమేమిటి?**

**జ.** పరమశివుడు విషాన్ని తాగాడని తెలుసుకున్న రుద్రపశుపతి ప్రాణత్యాగానికి సిద్ధపడగా శివుడు ప్రత్యక్షమై అతడిని వారించాడు. శివునితో పాటు పార్వతీ దేవి, శివగణాలు, దేవతలు అందరూ వెన్నంటినిలబడినారు. రుద్రపశుపతి ముగ్ధభక్తికి ముగ్ధుడైన ముక్కంటి "నేటి నుండి నీవు నా ఎడమ తొడమీద కూర్చొని నా నీలకంఠాన్ని గమనిస్తూ ఉండమని" చెప్పాడు. అప్పుడు "నీ గొంతులో హాలాహలం కొద్దిగా క్రిందకుగాని, పైకిగాని కదిలితే తాను కత్తితో పొడుచుకొని చనిపోతానని" రుద్రపశుపతి శివునితో శపథం చేశాడు.

**3. పాల్కురికి సోమన గురించి సంగ్రహంగా తెల్పండి?**

**జ.** తెలుగులో దేశీకవిత్వాన్ని అందలం ఎక్కించిన ప్రజాకవి సోమన. 12 వ శతాబ్దికి చెందిన సోమన ఓరుగల్లు సమీపంలోని పాలకుర్తి గ్రామానికి చెందినవాడు. తెలుగుతోపాటు ప్రసిద్ధ భారతీయభాషలలో సోమనకు పాండిత్యం ఉంది. వేద, శాస్త్ర, పురాణాలు మధించినవాడు. ఆంధ్రదేశంలో వీరశైవమత ప్రచారానికి, సంఘ సంస్కరణకు తన కవిత్వాన్ని సమర్థవంతంగా ఉపయోగించిన సోమన అసమాన ప్రజ్ఞావంతుడు. భృంగీశ్వరుని అవతారంగా భావించబడే సోమన బసవపురాణం, పండితారాధ్య చరిత్రలాంటి పలుగ్రంధాలు రచించాడు. శతకం, ఉదాహరణ, రగడ, అష్టకం ఇలా పలు ప్రక్రియల్లో రచనలు చేశాడు.

## III. సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. గరళంబు మ్రింగె శ్రీ కఱకంఠుడనిన**

**కవిపరిచయం :** ఈవాక్యం పాల్కురికి సోమన రచించిన "బసవపురాణం" నుండి గ్రహింపబడిన "రుద్రపశు పతి" అనుపాఠ్యభాగంలోనిది.

**సందర్భము :** "అయ్యళ" అనే గ్రామంలో ఒక కథకుడు శివుడు హాలాహలం తాగాడని చెప్పిన సందర్భంలోనిదీ వాక్యము.

**భావం** : ఆది పురాణంలో క్షీరసాగరమథనం కథను కథకుడు చెప్పగా రుద్రపశుపతి విన్నాడు.క్షీరసాగరమథనంలో ముందు భయంకర హాలాహలం ఉద్భవించిందని, ఆ హాలాహలం ముల్లోకాలను దహిస్తుందని బ్రహ్మ, విష్ణు, దేవతలు, దైత్యులు కూడా పరుగెడుతుంటే శివుడు ఆ గరళాన్ని (విషం) మింగాడని కథకుడు చెప్పినాడని భావం.

2. **ముక్కంటి నాకింక దిక్కెవరయ్య?**

**కవిపరిచయం :** ఈవాక్యం పాల్కురికి సోమన రచించిన "బసవపురాణం" నుండి గ్రహింపబడిన "రుద్రపశు పతి" అనుపాఠ్యభాగంలోనిది.

**సందర్భము :** పరమశివుడు విషము మింగాడని తెలుసుకున్న రుద్రపశుపతి రోదిస్తున్న సందర్భంలోనిదీ వాక్యము.

**భావం:** రుద్రపశుపతి నేలపై పడిదొర్లుతూ, "అయ్యో! విశ్వేశ!నిన్ను వెఱ్ఱివాడిని చేశారు. ఎంతటి వెఱ్ఱివారయినా విషము త్రాగుతారా? అది తాగి బతకగలరా? నిన్ను తప్పించి నాకు వేరెవరూ తెలియదు. ఓ మూడు కన్నులవాడా! నీవు తప్ప నాకు ఇక దిక్కెవరు?" అని బాధపడుతూ పలికినాడని భావం.

3. **అణుమాత్ర నా కంఠమందు జిక్కినది.**

**కవిపరిచయం :** ఈవాక్యం పాల్కురికి సోమన రచించిన "బసవపురాణం" నుండి గ్రహింపబడిన "రుద్రపశుపతి" అనుపాఠ్యభాగంలోనిది.

**సందర్భము :** విషప్రభావం తనపైన ఏమి ఉండదని శివుడు రుద్రపశుపతితో చెప్పిన సందర్భంలోనిదీ వాక్యము.

**భావం:** శివుని దివ్య కాంతులు అన్నిదిశలలో వ్యాపించగా పశుపతి రుద్రపశుపతితో "ఈ భయంకర హాలాహలం అనేది ఏమంత పెద్దవిషయం కాదు. అణువంత విషము మాత్రమే నా కంఠంలో ఉన్నది. ఈ విషయమును గురించి బాధపడటం ఎందుకు?" అనుచు వింత నవ్వు నవ్వినాడని భావం.

## IV. ఏకవాక్య/పద రూప సమాధాన ప్రశ్నలు

1. **సముద్ర మథనంలో ముందుగా వచ్చింది ఏమిటి?**

**జ.** హాలాహలం

2. **రుద్రపశుపతికి ప్రత్యక్షమైనది ఎవరు?**

**జ.** శివుడు పార్వతీ, (ప్రమథగణ సహితంగా శివుడు)

3. **శివునికి ఎవరు లేరని రుద్రపశుపతి బాధపడ్డాడు?**

**జ.** తల్లి లేదని బాధ పడ్డాడు.

4. **శివుడు దేనిని తన కంఠంలో ఉంచాడు?**

**జ.** హాలాహలం (కాలకూట విషం).

**5. రుద్రపశుపతికి శివుడు అప్పజెప్పిన బాధ్యత ఏమిటి?**

**జ.** తన ఎడమతొడ మీద కూర్చుని మెడలోని విషాన్ని కిందకు జారకుండా చూస్తూ ఉండమన్నాడు.

**6. పాల్కురికి సోమన ఎవరి అవతారమని భక్తుల విశ్వాసం?**

**జ.** భృంగి అవతారమని భక్తుల విశ్వాసం,

## V. సంధులు

**1. విశ్వేశుడు = విశ్వ + ఈశుడు = గుణసంధి**

**సూత్రం:** అకారమునకు ఇ - ఉ - ఋ లు పరమైనపుడు క్రమంగా ఏ - ఓ - అర్ ఆదేశంగా వచ్చును.

**2. ప్రత్యక్షము = ప్రతి+అక్షము = యణాదేశసంధి**

**సూత్రం :** ఇ - ఉ - ఋ లకు అసవర్ణాచ్చులు పరమైనపుడు క్రమంగా య - వ - ర లు ఆదేశమవుతాయి.

**3. కడుపునొచ్చినను = కడుపు+చొచ్చినను = గసడదవాదేశ సంధి**

**సూత్రం:** ప్రథమము మీది పరుషములకు గ - స - డ - ద - వ లు బహుళముగానగు.

**4. పరమాప్తులు = పరమ + ఆప్తులు - సవర్ణదీర్ఘ సంధి**

**సూత్రం :** అ - ఇ - ఉ - ఋ లకు సవర్ణాచ్చులు పరమైనపుడు క్రమంగా వీని దీర్ఘములు ఏకాదేశమగును.

**5. ఏమిసేయుదును = ఏమి + చేయుదును= గసడదవాదేశ సంధి**

**సూత్రం :** ప్రథమము మీది పరుషములకు గ,స,డ,ద,వ లు బహుళముగానగు.

**6. దిక్కెవ్వరు = దిక్కు + ఎవ్వరు = ఉకార సంధి**

**సూత్రం :** ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధి అగు.

**7. ప్రాణేశుడు = ప్రాణ + ఈశుడు = గుణ సంధి**

**సూత్రం :** అకారమునకు ఇ - ఉ - ఋ లు పరమైనపుడు క్రమముగ ఏ - ఓ - అర్ లు ఏకాదేశమగును.

**8. నేలబడి = నేలన్ + పడి = సరళా దేశ సంధి**

**సూత్రం :** i) ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు

ii) ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషలు విభాషనగు.

## VI. సమాసాలు

1. **ముక్కంటి** - మూడు కన్నులు కలవాడు (శివుడు) - బహువ్రీహి సమాసం
2. **పదాబ్జములు** - అబ్జముల వంటి పదములు-ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం
3. **కమలాక్షుడు** - కమలముల వంటి అక్షులు కలవాడు (విష్ణువు) - బహువ్రీహి సమాసం
4. **సురాసురులు** - సురలు మరియు అసురులు - ద్వంద్వ సమాసం
5. **దశదిశలు** - పది సంఖ్య గల దిక్కులు – ద్విగు సమాసం

# 3 - మంచి ముత్యాలు

**పద్యభావములు** **వివిధ కవులు**

1. **తలనుండి విషము ఫణికిని................................ విషము గదరా సుమతీ!**

**కవిపరిచయం** : ఈ పద్యం సా.శ 13 వ శతాబ్దంమునకు చెందిన బద్దెన కవి రచించిన సుమతీ శతకం నుండి గ్రహింపబడిన “మంచిముత్యాలు" అను పాఠ్యభాగంలోనిది.

**భావము :** పామునకు విషము తలయందు ఉంటుంది. తేలునకు విషము తోకయందు ఉంటుంది. చెడ్డవానికి విషము తల- తోక అనకుండా శరీరమంతా వ్యాపించి ఉంటుంది.

2. **ఒక్కడె చాలు నిశ్చలబలోన్నతుడెంతటి...... తుద ముట్టడె యొక్క కిరీటి భాస్కరా!**

**కవిపరిచయం :** ఈ పద్యం సా.శ 16వ శతాబ్దమునకు చెందిన మారద వెంకయ్య రచించిన భాస్కర శతకం నుండి గ్రహింపబడిన “మంచిముత్యాలు” అను పాఠ్యభాగంలోనిది.

**భావము :** ఓ భాస్కరా! దృఢమైన నిర్ణయం, స్థిరమైన చిత్తం, కార్యదక్షత కలిగిన వారు ఎంతటి కార్యమునైనా ఒక్కరే పూర్తి చేయగలరు. కౌరవులు అనేక మంది విరాటరాజు యొక్క ఆలమందలను తరలించుకుపోయారు. అప్పుడు అర్జునుడు ఒక్కడే వారి బలమైన సైన్యాన్ని పెక్కుబాణాలతో ఎదురించి, వారిని భంగపరిచి ఆలమందలను తిరిగి విరాటరాజు సొంతం చేశాడు కదా!

3. **నీతి ప్రౌఢవిహారులైన నిపుణుల్...... దప్పరుగదా నిత్యంబు ధీరోత్తముల్!**

**కవిపరిచయం :** ఈ పద్య సా.శ 18వ శతాబ్దంనకు చెందిన ఏనుగులక్ష్మణ కవి రచించిన "సుభాషిత రత్నావళి” నుంచి గ్రహించబడిన “మంచిముత్యాలు” అను పాఠ్యభాగంలోనిది.

**భావము :** గొప్ప ధైర్యగుణం కలిగిన వారిని నీతి వంతులైన పండితులు నిందించినా, మెచ్చుకున్నా, కీర్తి - ప్రతిష్ఠలు వచ్చినా, రాకున్నా, సంపదలు నిల్చిపోయినా, బ్రతుకు భారం అయిపోయినా, మరణం సంభవించినా, నియమం తప్పినా , యుగాంతమయినా గాని, ఎల్లపుడూ ధైర్యగుణము కలిగిన వారు ఉత్తమమైన నీతి మార్గమును విడిచిపెట్టరు.

## I. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

1. **“మంచిముత్యాలు” పాఠ్యభాగ సారాంశాన్ని తెలపండి.**

**జ.** శతకాలు ప్రధానంగా నీతిప్రబోధకాలు సుమతి, భాస్కర, వేమన, సుభాషిత త్రిశతి, నరసింహ శతకముల నుండి “మంచిముత్యాలు" అను పాఠ్యాంశం గ్రహించారు.

1. “నీరుత్రాగే గుర్రము, బలగర్వంతో విర్రవీగే ఏనుగు, ఆవు దగ్గర ఉన్న ఆబోతు దగ్గరకు వెళ్ళడం ఎంత ప్రమాదకరమో, చదువునేర్వని మూర్ఖుడు దగ్గరకు వెళ్ళడం కూడా అంతే ప్రమాదకరం. కట్టుకున్న భార్యతో అనవసరగొడవలు వద్దు.

ఉత్తమురాలైన ఇల్లాలి కంటి నీరు పడిన చోట లక్ష్మీదేవి కొలువుండదు. విష సర్పానికి తలలోనూ, తేలుకు తోకలోనూ ఉంటే నీచునికి నిలువెల్లా విషమే ఉంటుంది” అని సుమతీశతకకారుడు బద్దెన తెలిపాడు.

2. మంచి పనులు చేయాలని నిర్ణయించుకున్నపుడు అల్పులు నిరుత్సాహపరచినప్పటికీ వెనక్కితగ్గకూడదు. ఆహారంపై ఈగ వాలినంత మాత్రాన భోజనం విడిచిపెట్టం కదా! కార్యసాధకుడు నిశ్చలమైన బలంతో ఒక్కడే ఎంతటి ఘనకార్యమైనా సాధించగలడు. విరాట రాజు యొక్క వేలాది ఆలమందలను తరలించుకుపోయిన కౌరవులను అర్జునుడు ఒక్కడే జయించాడు కదా! అని భాస్కరశతకారుడు మారదవెంకయ్య తెలిపాడు.
3. “తగనివారితో కలసి తిరగరాదు. నిండునదులు గంభీరంగా నిలిచిప్రవహిస్తాయని, చిన్న చిన్న సెలయేర్లు పొంగి ప్రవహిస్తాయని, అల్పుడున్నంత తేలికగా అధికుడు ఉండజాలడు. నీచ ప్రవర్తన ఉన్నవాడు ఎన్ని విద్యలు నేర్చినా గొప్పవాడుకాలేడు. పరిమళాలు మోసినంత మాత్రాన గాడిద ఏనుగు అవ్వదు" అని వేమన తెలిపారు.
4. నీతిమంతులును ఎవరెన్ని విధాలుగా కీర్తించినా, నిందించినా వారు తమ నీతిమార్గంనుంచి సడలరు.
5. తల్లి గర్భంనుంచి ఎవరూ ధనం తీసుకురారు. చనిపోయేటపుడు అది మన వెంటరాదు. లక్షాధికారి అయినా ఉప్పుతో కలిపిన మెతుకులేకాని, బంగారపు మెతుకులు తినలేడు. సంపాదించిన సొమ్మును సద్వినియోగపరచాలి. లేకపోతే అది పరులపాలవుతుంది అని శేషప్పకవి తెలిపాడు.

**2. శతకప్రక్రియ విశిష్టతను తెల్పండి.**

సంస్కృత, ప్రాకృత వాఙ్మయ శతక ప్రక్రియకు తెలుగు శతక ప్రక్రియ ఒక ప్రతిబింబము. తెలుగులో శతకప్రక్రియ చాలా విశిష్ఠతను సంతరించుకుంది. శతక పద్యములు సారాంశాన్ని పామరులకు సైతం సులువుగా అందించే సాధనాలు. మానవసమాజంలో నైతిక విలువలను పెంచేందుకు శతకకవులు కృషి చేశారు. పాల్కురికి సోమన నుండి నేటి వరకు శతకప్రక్రియ అప్రతిహతంగా తన జైత్రయాత్రను కొనసాగిస్తూనే ఉంది.

### శతక లక్షణములు

1. సంఖ్యా నియమాన్ని కలిగి ఉంటుంది. సాధారణంగా 100 లేదా 108 లేదా 116 పద్యాలు ఉంటాయి.
2. ఛందో నియమాన్ని కలిగి ఉంటుంది. శతకంలో ఉన్న పద్యములన్నీ ఒకే ఛందస్సును కల్గిఉంటాయి.
3. మకుట నియమమును కలిగి ఉంటుంది. మకుటం అనగా కిరీటం అని అర్థం. సాధారణంగా మకుటం పద్యం చివరి పాదంలో ఉంటుంది.
4. ముక్తకము అనే లక్షణం కలిగి ఉంటుంది. ముక్తకం అనగా ముత్యము అని అర్థం. ముత్యాల దండలోని ముత్యములన్నీ విడివిడిగా స్వతంత్రంగా

ఎలా ఉంటాయో శతకపద్యములన్నీ స్వతంత్రంగా ఉంటాయి.
అనుసంధానత ఉండదు.

5. శతకం ఆత్మాశ్రయ కవిత్వానికి చెందినది. కవి తనస్వీయ అనుభవాలను స్వేచ్ఛగా ప్రకటించగలడు. ఈ విధంగా శతకాలు భక్తి వైరాగ్యములతో పాటుగా సామాజికస్థితిగతులను విశ్లేషించేందుకు, విద్యార్థులలో నైతికవిలువలు పెంపొందించేందుకు దోహదపడతాయి.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. సుమతిశతకకర్త తెలిపిన నీతిని తెల్పండి.**

**జ.** బద్దెన "సుమతి" శతకాన్ని రచించెను. ఇతడు సాధారణ శక సంవత్సరము 13వ శతాబ్దమునకు చెందినవారు. నీరుత్రాగే గుర్రం, బల గర్వంతో విర్రవీగే ఏనుగు, ఆవుదగ్గరున్న ఆబోతు దగ్గరకు వెళ్ళడం ఎంత ప్రమాదకరమో చదువు నేర్వని మూర్ఖుడు దగ్గరకు వెళ్ళడం కూడా అంతే ప్రమాదకరం. కట్టుకున్నభార్యతో అనవసర గొడవలు పడరాదు. ఉత్తమురాలైన ఇల్లాలికంటి నీరు పడినచోట లక్ష్మీదేవి కొలువు ఉండదు. విషమనేది సర్పానికి తలలోనూ, తేలుకు తోకలోనూ ఉంటే నీచునికి నిలువెల్లా విషమే ఉంటుంది"అని సుమతిశతకకర్త నీతిని బోధించెను.

**2. భాస్కర శతకకర్త బోధలను తెలపండి.**

**జ.** భాస్కర శతకకర్త మారదవెంకయ్య. ఇతడు సా.శ 16వ శతాబ్దికి చెందిన వారు. మంచిపనులు చేయాలని నిర్ణయించుకున్నపుడు ఒక్కోసారి అల్పులు వద్దని నిరుత్సాహపరుస్తారు. కానీ ఉత్తములు నిరుత్సాహపడకుండా పనిని పూర్తిచేస్తారు.మన భోజనంలో ఈగ వాలినంత మాత్రాన భోజనాన్ని విడిచిపెట్టంకదా! నిశ్చలమైన బలముకలిగిన కార్యసాధకుడు ఒక్కడే ఎంతటి ఘనకార్యమునయినా సాధించగలడు. కౌరవులు గొప్పసైన్యంతో విరాటరాజు యొక్క వేలాది ఆలమందలను తరలించుకు పోయినపుడు అర్జునుడు ఒక్కడే వారిని జయించాడు కదా! అని మారద వెంకయ్య వివరించాడు.

**3. వేమన పద్యాల సారాన్ని తెల్పండి.**

**జ.** ప్రజాకవి వేమన సా.శ 17వ శతాబ్దమునకు చెందినవాడు. నీతిశతకాలలో వేమన శతకం పేరెన్నికగన్నది. "అల్పబుద్ధికల వారితో కలిసితిరిగితే మనలను కూడా అల్పులుగానే పరిగణిస్తారు. తాటిచెట్టు క్రింద పాలుతాగితే వాటిని కల్లు అనుకుంటారు కదా! పెద్దనదులు నిండుగా ప్రవహిస్తూ ఉంటాయి. చిన్న చిన్న వాగులు మాత్రం శబ్దంచేస్తూ ప్రవహిస్తాయి. అల్పులు ప్రవర్తించినట్లు ఉన్నతమైనవారు ప్రవర్తించరు కదా! నీచప్రవర్తన ఉన్నవాడు ఎన్ని విద్యలు నేర్చినా గొప్పవాడు కాలేడు. పరిమళాలుమోసినంత మాత్రాన గాడిద ఏనుగు కాలేదు కదా!" అని వేమన విశదపరిచాడు.

**4. ఏనుగులక్ష్మణ కవి సుభాషిత సారాన్ని రాయండి.**

**జ.** ఏనుగు లక్ష్మణ కవి సా.శ 18వ శతాబ్దమునకు చెందివాడు. సంస్కృతంలో భర్తృహరి రచించిన "సుభాషిత త్రిశతి" ని తెలుగులోకి "సుభాషిత రత్నావళి" అను పేరుతో లక్ష్మణకవి అనువదించారు. ధీరోత్తములను నీతివంతులైనవారు ఎవరైనా నిందించినా, మెచ్చుకున్నా, కీర్తి-ప్రతిష్టలు వచ్చినా రాకున్నా, సంపదలు నిలిచినా, బ్రతుకు భారం అయిపోయినా, మరణం సంభవించినా, యుగాంతం అయినా కూడా వారు తమ యొక్క ఉత్తమ నీతి మార్గమును విడిచిపెట్టరు అని చెప్పాడు.

**5. శేషప్ప కవి తెలిపిన హితోక్తులను రాయండి.**

**జ.** శేషప్ప కవి సా.శ 18వ శతాబ్దమునకు చెందినవాడు. ఈయన "నరసింహశతకం" రాశారు. పుట్టినపుడు ఎవరూ తల్లి గర్భం నుండి ధనం తేలేరు. చనిపోయినపుడు ఎవరూ తమవెంట ధనం తీసుకుపోలేరు. లక్షాధికారి అయినా ఉప్పుకలిపిన మెతుకులే కాని, బంగారపు మెతుకులు తినలేడు. అమితమైన ధనసంపాదన చేసి విర్రవీగేవారు, ఆ సొమ్మునంతా అనుభవించలేరు. ఆ ధనాన్ని దానధర్మాలు చేయకుండా రహస్యంగా భూమిలో దాస్తారు. తేనెటీగలు కష్టపడి కూడబెట్టిన తేనెను బాటసారులకిచ్చునట్లు దానధర్మాలు చేయకుండా భూమిలో రహస్యంగా దాచిపెట్టబడిన ధనం అంతా దొంగల చేతికి గాని, రాజు చేతికి గాని చేరుతుంది. కాబట్టి ధనాన్ని కొంత దానధర్మాలు చేస్తూ సద్వినియోగపరచాలి.

## II. సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. ఒక్కడెచాలు నిశ్చలబలోన్నతుడు**

**కవిపరిచయం:** ఈ వాక్యము మారద వెంకయ్య రచించిన "భాస్కర శతకం" నుంచి గ్రహించబడిన "మంచిముత్యాలు" అనుమాపాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** ధృడమైన నిర్ణయం, కార్యదీక్ష కలిగిన వారి లక్షణములను కవి వివరించిన సందర్భంలోనిదీ వాక్యం

**భావం:** ధృడమైన నిర్ణయం, స్థిరమైన చిత్తం, కార్యదీక్షత కలిగిన వారు ఎంతటి కార్యమునైనా ఒక్కరే పూర్తి చేయగలరు. కౌరవులనేక మంది విరాటుని ఆలమందలను తరలించుకుపోయినప్పుడు అర్జునుడు ఒక్కడే వారినెదిరించి ఆలమందలను తిరిగి విరాటుని సొంతంచేశాడు. కాబట్టి దృఢచిత్తం కలవారు ఒక్కడే ఎంతకార్యాన్నైనా సాధించగలడని కవిభావం.

**2. తాటి క్రింద పాలు త్రాగిన చందమౌ**

**కవిపరిచయం:** ఈ వాక్యం వేమన రచించిన "వేమన శతకం" నుంచి గ్రహించబడిన "మంచిముత్యాలు" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** మంచివారు గుణహీనులతో సహవాసంచేస్తే వారిని కూడా గుణహీనులు గానే

లోకం జమకడుతుందని కవి చెప్పిన సందర్భంలోనిది వాక్యం

**భావం:** "కల్లు" తాటిచెట్టు నుంచి లభిస్తుంది. తాటిచెట్టు కింద కల్లు తాగటం సహజం కానీ తాటిచెట్టుకిందకు వెళ్ళి పాలు తాగితే, చూసేవారు కల్లు తాగుతున్నారనే అనుకుంటారని కవిభావము.

3. **అల్పుడాడు రీతి నధికుండు నాడునా**

**కవిపరిచయం:** ఈ వాక్యం వేమన రచించిన "వేమన శతకం" నుంచి గ్రహించబడిన "మంచిముత్యాలు" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అల్పస్వభావి మనస్తత్వాన్ని గురించి కవి చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**భావం:** గొప్పగొప్పనదులు గంభీరంగా నిండుగా, నిశ్చలంగా ప్రవహిస్తాయి. కాని వెర్రి వాగులు కొన్ని వేగంగా శబ్దంచేస్తు, డాంబికాన్ని ప్రదర్శిస్తూ ప్రవహిస్తూ ఉంటాయి. అలాగే అల్పస్వభావి ప్రవర్తించునట్లు ఉత్తముడు ప్రవర్తించడని కవి తెలిపినాడని భావం.

4. **తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు**

**కవిపరిచయం:** ఈ వాక్యము శేషప్ప కవి రచించిన "నరసింహశతకము" నుంచి గ్రహింపబడిన "మంచిముత్యాలు" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** ధనసద్వినియోగం గురించి కవి పలికిన సందర్భంలోనిదీ వాక్యం

**భావం:** పుట్టినపుడు ఎవరూ తల్లి గర్భంనుండి ధనం తేలేదు. చనిపోయినపుడు ధనము తనవెంటరాదు. ఎంతధనవంతుడయినా లవణం, అన్నమేకాని, బంగారుమెతుకులు మింగలేడు. డబ్బుసంపాదించి విర్రవీగుటయే కాని తాను సంపాదించినదంతా అనుభవించలేడు. రహస్యంగా దాచిపెట్టిన ధనం అంతా దొంగలపరమో, రాజులపరమో అవుతుంది. తేనెటీగలు కష్టపడి సంపాదించిన తేనె బాటసారులకు చేరుతుంది కదా! అని కవి పలికినాడని భావం.

## III. ఏకపద వాక్య సమాధాన ప్రశ్నలు :

1. **సుమతీ శతకాన్ని రచించింది ఎవరు?**

**జ.** బద్దెన

2. **భాస్కర శతక కర్త ఎవరు?**

**జ.** మారద వెంకయ్య

3. **దుర్యోధనాదులను ఎదుర్కొన్న ఒక్కడెవరు?**

**జ.** అర్జునుడు

4. **మనిషికి(ఖలునకు) విషం ఎక్కడుంటుంది?**

**జ.** నిలువెల్లా

5. **చనిపోయినప్పుడు వెంట రానిదేది?**

జ. ధనం

6. **తేనెటీగల కష్టం ఎవరి సొంతమవుతుంది?**

జ. బాటసారుల సొంతం

## సంధులు

1. **కన్నీ రొలికిన** = కన్నీరు + ఒలికిన - ఉత్వ సంధి
2. **ధీరోత్తములు** = ధీర + ఉత్తములు - గుణ సంధి
3. **యుగాంతం** = యుగ + అంతం= సవర్ణ దీర్ఘ సంధి
4. **దొంగల కిత్తురు** = దొంగలకు + ఇత్తురు - ఉత్వ సంధి
5. **బలోన్నతుడు** = బల + ఉన్నతుడు - గుణ సంధి
6. **నిలువెల్ల** = నిలువు + ఎల్ల - ఉత్వ సంధి

## సమాసాలు

1. **ధేనుకోట్లు** = కోట్ల సంఖ్యలో ఉన్న ధేనువులు - ద్విగు సమాసం
2. **కలకంఠి** = శ్రావ్యమైన కంఠం కలది (స్త్రీ) - బహుప్రీహి సమాసం
3. **నిండు నదులు** = నిండైన నదులు - విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
4. **దానధర్మములు** = దానములును, ధర్మములును - ద్వంద్వసమాసం

# 4. బాటసారి

## I. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)

**1. బాటసారి పాఠ్యభాగ సారాంశాన్ని తెల్పండి.**

**జ.** తెలుగులో అభ్యుదయ కవిత్వానికి ఆద్యునిగా భావించే శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) రచించిన "మహాప్రస్థానం" కవితా సంపుటి నుండి "బాటసారి" అను పాఠ్యభాగాన్ని గ్రహించారు.

'బాటసారి' కవితలో ఒక గ్రామీణ ప్రాంత యువకుడు ఉన్నఊరిలో ఉపాధి కరువై పట్టణంలో కూలిపని దొరుకుతుందనే ఆశతో తల్లి మాటలు వినకుండా బయలుదేరుతాడు. అయితే మూడురోజులపాటు ఏకధాటిగా, విరామం లేకుండా తిరుగుతూనే ఉన్నాడు. నడి సముద్రంలో నావ వలే దారి, గమ్యం తెలియలేకుండా బాధపడుతూ నడుస్తూనే ఉన్నాడు. నిరాశ, నిస్పృహ, అలసట, ఆకలిబాధ అధికమై, ఎండతీవ్రత ఎక్కువై, ఆ బాటసారికి జ్వరం వస్తే, కారుమబ్బులు కమ్మి కుంభవృష్టి (అధిక వర్షం) కురిస్తే అతని బాధ వర్ణనాతీతం.

బతుకుతెరువుకు పట్టణానికి వలస వెళ్లిన బాటసారి తల్లి తన కొడుకు కోసం ఏమని తలచుకుంటుందో?తీవ్రమైన ఎండలో తిరిగిన బాటసారి కళ్ళు చింతనిప్పుల్లాగా ఉన్నాయి. తలనొప్పితో తల్లడిల్లాడు. ఆ రాత్రి తన గుండె మీద పెద్ద నల్లరాయి (బరువైన రాయి) ఉన్నట్లు, తల్లి పిలిచినట్లుగా బాటసారికి అనిపించింది. ఆ పిలుపులేవీ తనకు వినపడలేదు. తన తల్లిని తలచుకుంటూ బాధపడుతూ, చాలావేదనను అనుభవించాడు.

బాటసారి బ్రతుకుకు అదే ఆఖరి రోజు. ఆ కటిక చీకటిలో గుడ్లగూబలు భయంకరంగా అరిచాయి. వాన ఆగిపోయింది. మబ్బుల్లో నుండి ఒక మెరుపు మెరిసింది. వేకువజామును తెలియజేస్తూ కోడికూసింది. వీడిన మబ్బుల నడుమ ఉన్న వేగుచుక్క వెక్కిరించింది. బాటసారి కళేబరంతో శీతవాయువు (చల్లగాలి) ఆడుకుంటుంది. పల్లెటూళ్లో కొడుకు కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్న ఆ తల్లికి పాడుకల వచ్చింది. కన్న పేగు కదిలింది. తన బిడ్డకు జరగరానిదేదో జరిగిందని ఆ తల్లి తీవ్రమైన వ్యధను అనుభవించింది.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. శ్రీరంగం శ్రీనివాసరావు గురించి వ్రాయండి.**

**జ.** శ్రీ అంటే అమృతం. శ్రీ అంటే విషం. వెరశి  శ్రీశ్రీ అంటే కవిత్వం. ఆధునిక తెలుగు కవిత్వాన్ని సామాన్యుల చెంతకు రప్పించి, మెప్పించి, సరికొత్త శిల్పాన్ని చొప్పించి భావితరాలకు అందించిన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) అభ్యుదయ కవిత్వానికి ఆద్యునిగా పేర్గాంచాడు. ఈయన 30-04-1910న విశాఖపట్టణంలో జన్మించారు." 1932 వరకు తెలుగు సాహిత్యం నన్ను నడిపిస్తే, 1932 తర్వాత తెలుగు సాహిత్యాన్ని నేను నడిపిస్తున్నాను. ఈ శతాబ్దం నాది" అని ప్రకటించుకున్న ఏకైక కవి శ్రీశ్రీ.

**రచనలు :** 1) మహాప్రస్థానం 2) మరో ప్రస్థానం 3) చరమ రాత్రి (కథల సంపుటి) 4) ఖడ్గసృష్టి 5) అనంతం (స్వీయ చరిత్ర)

ఖడ్గసృష్టి కావ్యానికి 1966లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి

**2. బాటసారి వ్యథను వివరించండి.**

**జ.** ఉన్న ఊరిలో ఉపాధికరువై పట్టణంలో పని దొరుకుతుందని తల్లి మాటను లెక్కచేయక వలసబాట పట్టిన బాటసారి మూడురోజుల పాటు ఏకధాటిగా విరామంలేకుండా తిరుగుతూనే ఉన్నాడు. దారి, తెన్నూ కనపడ లేదు. నిరాశ, నిస్పృహ, అలసట, ఆకలిబాధ అధికమై ఎండతీవ్రతకు ఆ బాటసారికి జ్వరం వచ్చింది. కుంభవృష్టికి తడిసి ముద్దయిన అతని వేదన వర్ణనాతీతం. తీవ్రమైన తలనొప్పితో తల్లిని తలుచుకుంటూ కాలం చేశాడు.

## III. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1. దారితప్పిన బాటసారికి ఎంతకష్టం.**

**కవిపరిచయం :** ఈ వాక్యము శ్రీరంగం శ్రీనివాసరావు రచించిన మహాప్రస్థానం కవితా సంపుటి నుండి గ్రహింపబడిన "బాటసారి" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భము:** ఉపాధి కొరకు పట్నంబాట పట్టిన బాటసారి దైన్య స్థితిని వివరిస్తూ కవి పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

**భావం :** బాటసారికి మూడు రోజులు విరామం లేకుండా తిరిగినా పని దొరకలేదు. దారి - తెన్నూ తెలియక నడి సముద్రంలో చిక్కుకున్న నావ వలె ఉన్నాడు, ఎండకు ఎండి, వానకు తడిశాడు, జ్వరం కాస్తే, భయం వేస్తే, చిమ్మ చీకటి కమ్ముకువస్తే దారి తప్పిన బాటసారికి చాలా కష్టం అని కవి పలికినాడని భావం.

**2. చెవులు సోకని పిలుపులేవో.**

**కవిపరిచయం :** ఈ వాక్యము శ్రీరంగం శ్రీనివాసరావు రచించిన మహాప్రస్థానం కవితా సంపుటి నుండి గ్రహింపబడిన "బాటసారి" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :** బాటసారి నిస్సహాయస్థితిని, దీనావస్థను వర్ణిస్తూ కవి పలికిన సందర్భంలోనిదీ వాక్యం

**భావం :**బతుకు తెరువుకు పట్టణానికి వలస వెళ్ళిన బాటసారి కోసం అతని తల్లి ఏమని తలచుకుంటుందో? బాటసారి కళ్ళు చింతనిప్పులలాగ ఉన్నాయి. గుండు సూదులతో తలను గుచ్చినట్లు తలబాధ అధికమయింది. ఆ రాత్రి తన గుండె మీద పెద్దరాతి బండను (నల్లరాయి) ఉంచినట్లు, తల్లిపిలిచినట్లుగా దృశ్యం కళ్ళముందు కనపడింది, చెవులు సోకని పిలుపులను తలచుకుంటూ బాటసారి బాధపడ్డాడని కవి తెలిపాడని భావం.

**3. పాడుకలలో పేగు కదిలింది.**

**కవిపరిచయం :** ఈ వాక్యము శ్రీరంగం శ్రీనివాసరావు రచించిన మహాప్రస్థానం కవితా సంపుటి నుండి గ్రహింపబడిన "బాటసారి" అను పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** ఉపాధి కొరకు తల్లిమాటను ఖాతరు చేయక పట్టణానికి వలసబాట పట్టిన బాటసారి చివరి స్థితిని కవి వర్ణించిన సందర్భంలోనిదీవాక్యము.

**భావం:** ఉపాధికోసం పట్టణానికి వలస వెళ్ళిన బాటసారి తిండిలేక ఆకలితో మరణించాడు. తన జీవితంలో ముసురుకున్న చీకట్లను వెక్కిరిస్తూ వేగుచుక్క ఉదయించింది. పల్లెటూళ్ళో ఉన్న అతని తల్లికి ఇదంతా తెలిసినట్లుగా, కన్న పేగు కదిలిందని కవి భావం.

# 5 - ఆంధ్రుడను

**- గుర్రం జాషువా**

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. "ఆంధ్రుడను" పాఠ్యభాగసారాంశాన్ని తెల్పండి.**

**జ.** కవికోకిల, మధురశ్రీనాధ బిరుదులు పొందిన కవి గుర్రం జాషువా. ప్రస్తుత పాఠ్యాంశం "ఆంధ్రుడను" అనేది "జాషువా సర్వలభ్య రచనల సంకలనం" నుండి గ్రహించారు.

"అనేక దేశాలలో ఖ్యాతిగడించిన భారతదేశము నాకు పాఠశాల వంటిది. సంగీత సాహిత్యాలకు కొలువైన సరస్వతీ దేవి నాకు చదువులమ్మ. సాందీపుడు అనేగురువు వద్ద విద్యనభ్యసించిన శ్రీకృష్ణుడు నాకు సహపాఠకుడు. భక్తి వైరాగ్యములకు నిలయమైన భాగవతం నాకు బాలశిక్ష. కలము చేతపట్టి సుందర అక్షరాలతో దేశపు ఘనకీర్తిని దిద్దుకునే ఆంధ్రపుత్రుడను నేను. అష్టాదశపురాణకర్త వ్యాసుడు మా ఆస్థాన కవి. శివధనస్సును ఎక్కుబెట్టి సీతమ్మను చేబట్టిన శ్రీరాముడు మా పొరుగువాడు. ముల్లోకాలను జయించగలిగిన శక్తి సంపన్నుడు భీముడు, మా ఊరి వ్యాయామవీరుడు. తనగానంతో రాళ్ళను సైతం కరిగించగల గాననిధి త్యాగరాజు మా ఇంటిగాయకుడు. హిమాలయ శిఖరమెక్కి దేశాన్ని కీర్తిస్తాను. విజయభేరి మోగిస్తాను. మాటతప్పని ఆంధ్రవీరుడను నేను.

మా శిల్పకళానైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు తాజ్‌మహలును, కవితా మాధుర్యాన్ని చెప్పేందుకు తిక్కనను చూపుతాను. మా విలువిద్య పటిమకు అర్జునుడిని, పతివ్రతల ఘనత చాటేందుకు సావిత్రిని ముందుంచుతాను. భరతమాతకీర్తిని విశ్వవ్యాప్తంగా చాటగలిగిన ఆంధ్రభూపతిని నేను. భూమండల మంతటికినీ అహింసను బోధించు దయాగుణానికి నా మనసు అద్దాలమేడ వంటిది. పేదల, అనాధలపట్ల దయకు నాగుండె పుట్టినిల్లు. తేనెవంటి కవితకు నా నాలుక కల్పతరువు. సంతోషమనే విమానమెక్కి కీర్తిమేఘాలమీద హాయిగా సంచరించే గొప్ప ఐశ్వర్యవంతుడను నేను.

శ్రీకృష్ణదేవరాయల ప్రతాపం మాకు వెలుగుదీపం. రాజరాజనరేంద్రుని కీర్తి మాకు పండు వెన్నెల. బొబ్బిలివీరుల శౌర్యం మాకు సహజకవచం. శత్రురాజుల పరాభవ పంకము మాకు సౌందర్యాన్ని కల్గించు కస్తూరిబొట్టు. గొప్పగ్రంధాలను రచించి, ఆంధ్రులు మెచ్చుకునే గొప్పవ్యాపారిని నేను" అని కవిజాషువా పేర్కొన్నాడు

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. విత్తవంతుడను నేను అని జాషువా తెలిపిన విధమెట్టిది?**

**జ.** "భూ మండల మంతటికినీ అహింసను బోధించు దయాగుణానికి నా మనసు అద్దాలమేడవంటిది. నిరుపేదలకు దానం చేసే తత్వం నాది. అనాధలపట్ల దయకు నా గుండె పుట్టినిల్లు. అందమైన అలంకారాలతో శోభిల్లే తేనె వంటి కవితకు నా నాలుక కల్పతరువు.సంతోషమనే విమానము ఎక్కి కీర్తి మేఘముల మీద హాయిగా సంచరించే గొప్ప ఐశ్వర్యవంతుడిని నేను". అని కవికోకిల, మధుర శ్రీనాధ గుర్రం జాషువ తెలియజేశారు.

**2. జాషువా హిమాలయ శిఖరమెక్కి గానం చేస్తానని చెప్పిన విషయాలు ఏవి?**

**జ.** "అష్టాదశ పురాణకర్త, దేవర్షి అయిన వ్యాసుడు మా ఆస్థాన కవి. శివధనస్సును ఎక్కుపెట్టి సీతమ్మను చేపట్టిన శ్రీరాముడు మా పొరుగువాడు. ముల్లోకాలను జయించగల శక్తి సంపన్నుడు భీముడు మా ఊరి వ్యాయామ వీరుడు. తనగానంతో రాళ్ళను సైతం కరిగించగల గాననిధి త్యాగరాజు మా ఇంటి గాయకుడు. హిమలయ శిఖరమెక్కి దేశకీర్తి ప్రతిష్ఠలను అద్భుతమైన పద్యాల ధారణతో ప్రపంచానికి తెలియజేస్తాను. విజయభేరి మోగిస్తాను. మాటతప్పని ఆంధ్రవీరుడిని నేను" అని జాషువా తెలియజేశారు.

**3. జాషువా రచనలు పేర్కొనండి.**

**జ.** కవికోకిల, మధురశ్రీనాథబిరుదులు పొందిన కవి గుర్రం జాషువా వీరి

**రచనలు.**

| | | | |
|---|---|---|---|
| 1) గబ్బిలము | 2) ఫిరదౌసి | 3) స్వప్నకథ | 4) కాందిశీకుడు |
| 5) నేతాజీ | 6) బాపూజీ | 7) ముసాఫిరులు | 8) నాగార్జునసాగర్ |
| 9) క్రీస్తు చరిత్ర | 10) ముంతాజ్ మహలు | | |

వీరి "క్రీస్తు చరిత్ర" కు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డ్ లభించింది. వీరి స్వీయచరిత్ర "నాకథ" పద్యరూపంలో ఉంటుంది.

## III. ఏక పద, వాక్య సమాధాన ప్రశ్నలు.

**1. భక్తి వైరాగ్యాలకు నిలయమైన గ్రంథమేది?**

**జ.** భాగవతం

**2. గాండీవి అనగా ఎవరు?**

**జ.** అర్జునుడు

**3. మన ఆస్థాన పండితునిగా జాషువా ఎవరిని పేర్కొనెను?**

**జ.** వ్యాస మహర్షి

**4. జాషువా ఎప్పుడు జన్మించాడు?**

**జ.** 1895 (సెప్టెంబర్,28)

**5. జాషువా బిరుదులేవి?**

**జ.** కవికోకిల, కవితావిశారద, నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాధ కవిదిగ్గజ మొ॥వి.

**6. శిల్ప నైపుణ్య మహిమము ఉదాహరించడానికి కవి పేర్కొన్న నిర్మాణమేది?**

**జ.** తాజ్ మహలు

**7. శీల సంపదకు ప్రతీకగా కవి ఎవరిని పేర్కొన్నారు?**

**జ.** సతీసావిత్రి

**8. తన గాన నైపుణ్యంతో రాళ్ళను సైతం కరిగించిన భక్తుడెవరు?**

**జ.** త్యాగరాజస్వామి

# IV. సందర్భ సహిత వ్యాఖ్యలు:

## 1. మడమతిప్పని యాంధ్రవీరుడను నేను.

**కవిపరిచయం :**ఈ వాక్యము “జాషువా సర్వలభ్య రచనల సంకలనం” నుండి గ్రహింపబడిన “ఆంధ్రుడను” అను పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :**భారతీయ ఇతిహాస, సంగీత వైభవాన్ని కీర్తిస్తూ కవిపలికిన సందర్భంలోనిదీ వాక్యము.

**భావం :** “అష్టాదశపురాణకర్త వ్యాసుడు మా ఆస్థానకవి. శ్రీరాముడు మా పొరుగువాడు. బలశాలి భీముడు మా ఊరి వ్యాయామవీరుడు. రాళ్ళను సైతం తనగానంతో కరిగించగల త్యాగరాజు మాఇంటి గాయకుడు. హిమాలయశిఖరమెక్కి దేశకీర్తి ప్రతిష్ఠలను అద్భుతమైన పద్యాల ధారణతో ప్రపంచానికి తెలియజేస్తాను. విజయభేరి మోగిస్తాను. మాటతప్పని,మడమతిప్పని ఆంధ్రవీరుడను నేను” అని కవి పేర్కొన్నాడని భావం.

## 2. కరుణకు నా గుండె పుట్టినిల్లు

**కవిపరిచయం:** ఈవాక్యము “జాషువా సర్వలభ్య రచనల సంకలనం” నుండి గ్రహింపబడిన “ఆంధ్రుడను” అను పాఠ్య భాగంలోనిది.

**సందర్భం:** భారతీయధర్మమునకు మూలమైన కరుణ, దయ, అహింసలను గురించి కవి పలికిన సందర్భంలోనిదీ వాక్యము.

**భావం:** "భూమండలము (ప్రపంచము) అంతటికినీ అహింసను బోధించు దయాగుణానికి నా మనసు అద్దాలమేడవంటిది. నిరుపేదలకు బంగారు గుప్పిటతో దానం చేసేందుకు నా చేయి అనుకూలము. అనాథలను చూసి కన్నీరు చిమ్మె కరుణకు నా గుండె పుట్టినిల్లు” అని కవి పలికినాడని భావము.

## 3. సమగ్రప్రతాపము దీపకళికమాకు.

**కవిపరిచయం:** ఈవాక్యము "జాషువా సర్వలభ్య రచనల సంకలనం” నుండి గ్రహింపబడిన “ఆంధ్రుడను”అను పాఠ్య భాగంలోనిది.

**సందర్భం:** శ్రీకృష్ణదేవరాయుల ప్రతాపమును గురించి కవి చెప్పిన సందర్భంలోనిదీ వాక్యము.

**భావం:** “సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు కాలంలో విజయనగర సామ్రాజ్యము దుర్భేద్యం అయింది. శత్రువుల పీచమణచి అనేక విజయాలు సాధించాడు. భాషాసాహిత్యాలకు స్వర్ణయుగంగా నిలిచింది. అష్టదిగ్గజకవులను ఆదరించాడు. శ్రీకృష్ణదేవరాయల శౌర్యప్రతాపము మాకు వెలుగునిచ్చే దీపసముదాయము” అని కవి చెప్పాడని భావం.

# V. సంధులు

## 1. సవర్ణదీర్ఘ సంధి: అ - ఇ - ఉ - ఋ లకు సవర్ణములైన అచ్చులు పరమైనప్పుడు

వాని దీర్ఘములు ఏకాదేశమగును.

1. మోహనాక్షరములు - మోహన+ అక్షరములు
2. మంజులాలంకార - మంజుల + అలంకార
3. సాధ్యాంగనలు - సాధ్య+ అంగనలు

2. **గుణసంధి:** అకారమునకు ఇ - ఉ - ఋ లు పరమైనప్పుడు క్రమముగా ఏ - ఓ - అర్ లు ఏకాదశేమగును.

1. నరేంద్ర -నర + ఇంద్ర
2. మహోన్నత - మహా + ఉన్నత
3. దేవర్షి -దేవ + ఋషి

3. **యడాగమ సంధి:** సంధి లేనిచోట స్వరంబుకంటే పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

1. మా ఇల్లు = మా + ఇల్లు
2. మాయూరు = మా + ఊరు

4. **ఉత్వసంధి:** ఉత్తునకు అచ్చు పరంబగునప్పుడు సంధియగు

1.పందెమొడ్డెద - పందెము + ఒడ్డెద

5. **టుగాగమ సంధి : i)** కర్మధారయ సమాసంలో ఉత్తునకు అచ్చుపరమైనపుడు టుగాగమంబగు

ii) కర్మధారయమునందు పేర్వాది శబ్దములకు అచ్చుపరమైనపుడు టుగాగమం వైకల్పికంబగు.

1. వలపుటంగడి = వలుపు + అంగడి

## VI. సమాసములు

| సమాసం | విగ్రహవాక్యం | సమాస నాయం |
|---|---|---|
| కీర్తి మేఘములు | కీర్తి అనెడి మేఘములు | రూపక సమాసం |
| భక్తి వైరాగ్యములు | భక్తియును వైరాగ్యమును | ద్వంద్వ సమాసం |
| ముల్లోకములు | మూడు అను సంఖ్యగల లోకములు | ద్విగు సమాసం |
| అద్దాల మేడ | అద్దాల తోడి మేడ | తృతీయా తత్పురుష సమాసం |
| ధనుర్విద్యారమ | ధనుర్విద్య అనెడి రమ | రూపక సమాసం |
| శీతనగము | శీతలమైన నగము | విశేషణపుర్వపద కర్మధారయ సమాసం |
| సిద్ధ సాధ్యులు | సిద్ధులును సాధ్యులును | ద్వంద్వ సమాసం |
| భాషా వధూటి | భాష అనెడి వధూటి | రూపక సమాసం |
| అహింస | హింస కానిది | నఞ్ తత్పురుష సమాసం |

# 1.మహాత్మా జ్యోతిబాపూలే

(గద్య భాగం)

- డా॥ బి. విజయభారతి

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.

**1. జ్యోతి బావులే విద్యాభ్యాసం, సాంఘిక పోరాట నేపథ్యాన్ని వివరించండి?**

**జ.** గోవిందరావు పూలే తన కుమారుడైన జ్యోతిబాపూలేను ఏడవయేట స్థానిక మరాఠీ పాఠశాలలో చేర్పించాడు. చదువులో జ్యోతిబా చాలా చురుకైనవాడు. తన సహధ్యాయులే గాక, ఉపాధ్యాయులు కూడా ఆశ్చర్యపోయే స్థాయిలో పూలే విద్యాభ్యాసం కొనసాగింది. చదువుపట్ల ఆయనకున్న శ్రద్ధ, పట్టుదల చూచి తోటి విద్యార్థి సదాశివ బల్లాల్ గోవాండే జ్యోతిబాకు మంచి మిత్రుడయ్యాడు. వీరిద్దరూ మెదడుకు పదునుపెట్టే రచనలు చదువుతుండేవారు. ఆ సమయంలోనే వారికి మహాపురుషుడైన శివాజీ మహారాజు మరియు అమెరికా అధ్యక్షుడు జార్జివాషింగ్టన్ల జీవిత చరిత్రల పుస్తకాలు లభించాయి. మాతృభూమిని ఉద్ధరించడానికి వారిద్దరూ పడిన తపన, కార్యదీక్షలను గురించి తెలుసుకున్న మిత్రులిద్దరూ బాగా ప్రభావితులయ్యారు. ఈ నేపథ్యంతో థామస్ పెయిన్ వ్రాసిన "రైట్స్ ఆఫ్ మాన్", జాన్ స్టువర్ట్ మిల్ రచించిన "ఆన్ లిబర్టీ" అనే గ్రంథాలను పూలే అధ్యయనం చేయడం జరిగింది. ఇవి ఆయన ఆలోచనావిధానంపై బలమైన ముద్రవేశాయి. స్వతంత్ర ఆలోచనా విధానాన్ని అలవర్చుకునేటట్లు చేశాయి.

"తరతరాలుగా నిజాలుగా చలామణి అవుతున్నవన్నీ సత్యాలు కాదు. వాటిని ముందు తెలుసుకోవాలి. సహేతుకంగా చర్చించాలి. విపులంగా విమర్శించాలి అప్పుడే యదార్థం తెలుసుకోగలుగుతాము" అని చెప్పిన జాన్ స్టువర్ట్ మిల్ మాటలను జ్యోతిబా ఆచరణలో పెట్టడం ప్రారంభించాడు. ఎవరికైనా చదువువలనే జ్ఞానము, జ్ఞానం వలన నైతికవిలువలు, నైతిక విలువల పునాదుల మీదనే పటిష్టమైన సమాజము నిర్మించబడుతుందని పూలే గట్టిగా విశ్వసించాడు. అణగారిన వర్గాల ప్రజలకు తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా తెలుసుకుని చెప్పగల ధైర్యం విద్యవలనే వస్తుందని జ్యోతిబా గ్రహించాడు. స్నేహితులంటే ప్రాణమిచ్చే జ్యోతిబా ఒక బ్రాహ్మణ మిత్రుడు పిలిచిన వివాహకార్యక్రమానికి హాజరయ్యాడు. అక్కడ కొందరు కులదురహంకారుల చేత నిందించబడ్డాడు. తీవ్రమైన మానసిక బాధకు గురయ్యాడు. ఆ అవమానమే ఆయన జీవిత గమనాన్ని మలుపు తిప్పింది. శూద్రుల ఆత్మగౌరవ పోరాటం వైపు నడిపించింది.

**2. జ్యోతి బాపులే సంఘ సంస్కరణ ఉద్యమం గురించి వ్రాయండి?**

**జ.** సమస్త శూద్రులు అన్నిరంగాలలో పతనం కావడానికి వారి అవిద్యే కారణమని జ్యోతిబా ప్రకటించాడు. సంఘాన్ని సంస్కరించనిదే దేశం అభివృద్ధి చెందలేదని గ్రహించిన పూలే తన 21వ యేట సాంఘిక సంస్కరణ పోరాటంలోనికి అడుగు పెట్టాడు. కుట్రపూరితంగా ధర్మశాస్త్రాలలో జొప్పించిన అనేక అబద్ధపు విషయాలు, ఎన్నో అమానవీయమైన ఆంక్షలకు కారణమయ్యాయని పూలే గట్టిగా విశ్వసించాడు. ఆ నాటి మరాఠా సమాజంలో స్త్రీల పరిస్థితి దయనీయంగా ఉండేది. ఎన్నో ఆంక్షల మధ్య బ్రతక వలసివచ్చేది. మరో ప్రక్క దేశం బానిసత్వంలోనికి నెట్టివేయబడింది. స్త్రీలు, శూద్రులు చదువుకు పూర్తిగా దూరమయ్యారు. ఈ తరుణంలో పూలే "రండి! చదువుకోండి. చదువు మీకు ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుంది" అని ప్రకటించాడు. పట్టుబట్టి బాలికలను బడికి తీసుకువచ్చేవాడు. సంప్రదాయవాదులు వ్యతిరేకిస్తే ముందు తన భార్యకు విద్యనేర్పించి ఆమెతో బాలికలకు పాఠాలు చెప్పించాడు.

1848లో పూలే సావిత్రిభాయి దంపతులు పూణెలో తొలి బాలికా పాఠశాలను స్థాపించారు. నిమ్న జాతుల పిల్లల ముంగిట్లో చదువు అనే దీపాలు వెలిగించారు. సంఘసంస్కరణే ధ్యేయంగా జ్యోతిబా 1873లో "సత్యశోధక సమాజాన్ని" స్థాపించాడు. ఈ సమాజం సంఘంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను పారద్రోలడానికి విశేషకృషి చేసింది. పూలే తృతీయరత్న, గులాంగిరి, సత్సార్ అనే రచనల ద్వారా సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్ళగలిగాడు. శివాజీ వీరగాధను "పవాడే" గా వ్రాశాడు, కుడి చేతికి పక్షవాతం వస్తే ఎడమ చేతితో "సార్వజనిక సత్యధర్మ" అనే పుస్తకాన్ని వ్రాసి ప్రకటించారు. ఇలా ఎన్నో నిర్మాణాత్మకమైన పనులు ద్వారా సమాజంలో అలుముకున్న అజ్ఞానమనే చీకటిని తొలగించినందుకు గాను డా. బి. ఆర్ అంబేద్కర్ తన ముగ్గురు గురువులలో "పూలే ఒకరని ప్రకటించారు.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. పూలే దంపతులు బాలికల విద్యకోసం చేసిన కృషిని వివరించండి?**

**జ.** మారాఠీ సమాజంలో పూర్వం స్త్రీలపై చాలా ఆంక్షలు ఉండేవి. వారికి ఎలాంటి హక్కులూ లేవన్న విషయాన్ని గ్రహించిన పూలే దంపతులు " రండి చదువుకోండి - చదువు మీకు విజ్ఞానాన్ని, ఆనందాన్ని అందిస్తుంది" అని ప్రచారం చేశారు. బాలికలను బడికి తీసుకురావడాన్ని, వారికి చదువు చెప్పించడాన్ని సంప్రదాయవాదులు వ్యతిరేకించారు. బడికి ఉపాధ్యాయులు రాకుండా అడ్డుకున్నారు. మొక్కవోని ధైర్యంతో పూలే ముందుగా తన భార్యకు చదువునేర్పించి బడిలో పాఠాలు చెప్పించేందుకు పంపించాడు. 1848లో జ్యోతిబా దంపతులు పూణేలో తొలి బాలికా పాఠశాలను నెలకొల్పారు. సావిత్రిభాయి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచారు.

**2. "సత్యశోధక" సమాజం గురించి వ్రాయండి?**

**జ.** సంఘ సంస్కరణే ధ్యేయంగా 1873 సెప్టెంబరు 24న జ్యోతిబా "సత్యశోధక సమాజాన్ని స్థాపించారు. సత్యాన్ని అన్వేషించే సమాజం అని దీని అర్థం. ఆధునిక భారతదేశంలో సాంఘిక ఉద్యమాన్ని ప్రారంభించిన సంస్థలలో ఇది మొదటిది. అణగారిన వర్గాల బాధలను ప్రపంచానికి చాటి చెప్పడానికి ఈ సంస్థ కృషిచేసింది. ఈ సంస్థ లక్ష్యాలు: (1) వెనుకబడిన కులాలవారికి విద్యనందించడం (2) విదేశీవస్తువుల వాడకాన్ని తగ్గించడం (3) స్వదేశీ వస్తు ప్రోత్సాహం (4) ఆడంబరాలు లేని వివాహాలు జరిపించడం (5) మతసహనం (6) మూఢనమ్మకాల నిర్మూలన (7) తోటి మానవుల పట్ల సోదర భావం కలిగిఉండటం.

**3. జ్యోతిబా పూలేకు మహాత్మా బిరుదు ప్రదానం గురించి వ్రాయండి?**

**జ.** జ్యోతిబా పూలేకు 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఆయన అభిమానులు,అనుచరులు ఆయనకు పెద్దఎత్తున సన్మానం చేయాలని నిర్ణయించారు. బొంబాయి నగరంలోని మాండ్వీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సభకు వేలాదిగా జనం తరలి వచ్చారు. వివిధ రంగాలలో ప్రముఖులైన వాళ్ళు జ్యోతిబా ఆదర్శ జీవితం గురించి మాట్లాడారు. అక్కడకు చేరిన పెద్దలంతా జ్యోతిబాకు "మహాత్మా" బిరుదును ప్రదానం చెయ్యాలని ప్రతిపాదించారు. ఆ

సభలోనే ఉన్న బరోడా మహారాజు శాయాజీ రావ్ గైక్వాడ్ వంటివారు అందుకు సమ్మతి తెలియచేశారు. వేలాదిగా చేరిన ప్రజలు హర్షంతో నినాదాలు చేస్తుండగా జ్యోతిబాకు "మహాత్మ" బిరుదు ప్రదానం చేయబడింది. పూలే ఈ బిరుదు పొందిన తొలి భారతీయుడు

**4. డా. బి. విజయ భారతి గారి గురించి తెలియ చేయండి.**

**జ.** డా. బి. విజయభారతి ప్రముఖరచయిత బోయి భీమన్న గారి కుమార్తె. ఈమె కాకినాడలోని పిఠాపురం మహారాజా కళాశాల, హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయాల్లో చదువుకున్నారు. "దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం- సాంఘిక పరిస్థితులు" వీరి పరిశోధనా గ్రంథం. పురాణాలు, కులవ్యవస్థ, షట్చక్రవర్తులు వంటి రచనలు, ఇంకా ఇంగ్లీషునుండి తెలుగులోనికి అనువాదాలు చేశారు. ప్రముఖ న్యాయవాది బొజ్జా తారకం గారి భార్య అయిన ఈమె నిజామాబాద్ మహిళా కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖలో అనువాదకురాలిగా, తెలుగు అకాడమీ రీసెర్చ్ ఆఫీసరుగా, డిప్యూటి డైరెక్టరుగా సేవలందించారు.

## III. ఏక వాక్య సమాధాన రూప ప్రశ్నలు

**1. జ్యోతిబాపూలే తల్లి తండ్రుల పేర్లేమిటి?**

**జ.** గోవిందరావు పూలె, చిమ్నాబాయి.

**2. జ్యోతిబా -గోవాండే లు ఎవరి జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తిపొందారు?**

**జ.** శివాజీ మహారాజ్ - జార్జి వాషింగ్టన్

**3. 1873లో జ్యోతిబాపూలే ఏర్పాటు చేసిన సంఘసంస్కరణ సంస్థ పేరు ఏమిటి?**

**జ.** సత్యశోధక సమాజం

**4. జ్యోతిబాపూలే దంపతులు పెంచుకున్న బాలుని పేరేమిటి?**

**జ.** యశ్వంత్

**5. మరాఠీ వాడుక భాషలో పూలే వ్రాసిన ప్రసిద్ధ రచన ఏది?**

**జ.** గులాంగిరి.

# 2. జాయ సేనాపతి

**- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ**

## I. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. జాయసేనాపతి బాల్యము, విద్యాభ్యాసము, రాజబంధువు కావడాన్ని వివరించండి?**

**జ.** కృష్ణవేణి నది సముద్రంలో కలిసేచోట ఏర్పడిన సీమ ద్వీపసీమ. నేటికి 800 సం॥ క్రితం దీనిని అయ్యపినచోడి నాయకుడు తమ ప్రభువు వెలనాటి పృథ్వీశ్వరుని పక్షాన పరిపాలించేవాడు. ఆయనకు ఐదుగురు సంతానం. వీరిలో చిన్నవాడు జాయప్ప. ద్వీపసీమకు ఆనాటి రాజధాని అయిన పెదదీవిపురంలో పుట్టిన జాయప్ప అక్కడే -క్షత్రియోచిత విద్యలు నేర్చుకున్నాడు. అతడికి పదేండ్లయినా నిండక ముందే కాకతీయ సైన్యం ద్వీపసీమపై భీకర దాడి చేసింది. ఆ యుద్ధంలో పినచోడి నాయకుడు వీరోచితంగా పోరాడినా ఫలితం దక్కలేదు. కాకతీయ సేనానులు అపారమైన సంపదతోపాటు బాలుడైన జాయప్పను కూడా ఓరుగల్లుకు తరలించారు.

కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడు యుద్ధబందీగా చిక్కిన జాయప్పలో తొణికిసలాడుతున్న మర్యాద, స్వామిభక్తి, సౌందర్యాన్ని చూచి ముచ్చటపడ్డాడు. అతడు మహావీరుడౌతాడని అంచనా వేశాడు. దేవేంద్రుడు తన జయంతునికి విద్యాబుద్ధులు చెప్పడానికి దేవగురువు బృహస్పతికి అప్పజెప్పినట్లుగా తన గురువుల వలన గణపతిదేవుడు విన్నాడు. తన ఆస్థాన నాట్యాచార్యుడు, మంత్రాంగం తెలిసినవాడు అయిన గుండామాత్యునికి జాయప్పను అప్పజెప్పాడు. ఆయన వద్దే జాయప్ప ఒక ప్రక్క యుద్ధ విద్యలు, మరో ప్రక్క నాట్యశాస్త్ర రహస్యాలు తెలుసుకున్నాడు. చక్రవర్తి అయిన గణపతి దేవునికి అప్పటికి సోమలదేవితో వివాహం అయ్యింది. అయ్య వంశం వారి బలపరాక్రమాలు, జాయప్ప ప్రతిభా పాటవాల పట్ల మక్కువతో, జాయన సోదరీమణులైన నారమ్మ, పేరమ్మలను, చక్రవర్తి వివాహం చేసుకున్నాడు. ఆనాటి నుండి జాయన రాజాశ్రితుడుగా కాకుండా రాజబంధువై వెలుగొందాడు.

**2. నృత్త రత్నావళి గురించి వివరించండి?**

**జ.** భారతీయుల దృష్టిలో కళలు 64 . అందులో ఆరింటిని లలిత కళలు అంటారు. ఆ లలితకళలలో సంగీతం, నాట్యం ప్రజలకు ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి. భారతీయ నృత్య సంప్రదాయాలన్నింటికీ భరతముని వ్రాసిన " నాట్యశాస్త్రమే" మూలము. ఆ గ్రంథం 2వేల సంవత్సరాలకన్నా ముందు నుండి ప్రచారంలో ఉంది. ఆ తరువాత నందికేశ్వరుడు " అభినయ దర్పణ" మనే నాట్యశాస్త్రం వ్రాశాడు. ఈ రెండింటినీ జాయన క్షుణ్ణంగా చదువుకున్నాడు. గజసాహిణిగా గొప్పయుద్ధాలు చేసి గెలిచిన జాయసేనాపతి విశ్రాంతి

సమయాలలో దేశమంతా పర్యటించాడు. స్థానికులైన తెలుగువారు ఎన్నో దేశినృత్త". రీతులను జనరంజకంగా ప్రదర్శించడాన్ని గమనించాడు. వాటికొక లక్షణ గ్రంథం లేదన్న సంగతిని గ్రహించాడు. భరతముని నాట్యశాస్త్రాన్ని ప్రమాణంగా భావించి "మార్గ" రీతిలో ఉన్న నృత్య విధానాలను స్థానికంగా ప్రదర్శిస్తున్న "దేశి" నృత్త విధానాలను మేళవించి 8 అధ్యాయాలుగా ప్రామాణికమైన "నృత్తరత్నావళి" ని జాయన రచించాడు.

పరమశివుని అనుగ్రహంవలన, పండితులైన మిత్రుల సలహాలతో 60 సంవత్సరముల వయసులో జాయన సాధారణశకం 1254 నాటికి నృత్తరత్నావళిని సంస్కృతంలో ప్రణాళికాబద్ధంగా పూర్తి చేశాడు. నాట్యానికి, నృత్యానికి, నృత్తానికి వేరు వేరుగా లక్షణాలు వివరించాడు. జాయన తన రచన ప్రళయం తరువాత కూడా నిలిచి ఉంటుందని, బ్రహ్మదేవుని చేత రాబోయే కృతయుగారంభంలో కీర్తించబడుతుందని ప్రకటించాడు. ఇంతటి గొప్ప గ్రంథం వ్రాసిన జాయ సేనాపతి ఆంధ్రుడవ్వడం మనందరికీ గర్వకారణం.

## II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

**1. జాయసేనాపతి కళింగ యుద్ధం గురించి వ్రాయండి?**

**జ.** జాయన సమర్థతను గమనించిన కాకతి గణపతిదేవ చక్రవర్తి తన సైన్యంలోని యుద్ధగజాలకు సాహిణిగా నియమించాడు. ఆంధ్రదేశంలోని గోదావరి నదికి ఉత్తరంగా, ఒడిస్సాలోని మహానదికి దక్షిణంగా ఉన్న తీరాంధ్ర ప్రాంతమే కళింగము. ఈ భూభాగాన్ని కాకతీయ సామ్రాజ్యంలో కలిపేయడానికి సాధారణ శకం 1212లో ఇందులూరి సోమయ్య మంత్రి, రాజనాయకుడు వెంట రాగా జాయన తన చక్రవర్తి తరపున యుద్ధానికి వెళ్ళాడు. " శత్రువులనే గోధుమలను పిండిగా ఆడించే తిరుగలి" అని పేరుపొందిన గొప్ప యోధుణ్ణి చంపి కళింగ ప్రాంతాన్ని స్వాధీనంచేసుకున్నాడు. తోటి సేనానులు వెంట రాగా విజయోత్సాహంతో దక్షారామాన్ని సందర్శించాడు. భీమేశ్వర స్వామికి శాశ్వత దీపదానం చేశాడు.

**2. జాయన వ్యక్తిత్వం గురించి వ్రాయండి?**

**జ.** జాయన తనకు నాయంకరంగా ఇవ్వబడిన చేబ్రోలులో తండ్రిపేరుతో చోడేశ్వరాలయం నిర్మించాడు. వ్యవసాయం కోసం గొప్ప చెఱువు త్రవ్వించి "చోడ సముద్రమని" పేరు పెట్టాడు. అక్కడి దేవాలయాలలో సేవల కోసం గుడి సానులను ఏర్పాటు చేయడమే గాక వారికి రెండంతస్తుల ఇళ్ళను కూడా నిర్మించి ఇచ్చాడు. పెదదీవిపురం సమీపంలో తన బావగారి పేరుతో గణపేశ్వరం అనే గ్రామాన్ని కట్టించి అందులో గణపేశ్వరాలయాన్ని నిర్మించాడు. చాలా చెఱువులు త్రవ్వించాడు, తోటలు వేయించాడు. పలు దేవాలయాలకు భూములు దానం చేశాడు. వృత్తులు నిలిపాడు. యుద్ధంలో తానేముందుండి సైన్యాన్ని నడిపే జాయన, సాహిత్య సభలలోనూ ఉన్నత స్థానాన్ని అలంకరించే వాడు. ప్రియంగా మాట్లాడే జాయన మంత్రాంగం తెలిసినవాడు. రాజభక్తి కలవాడు. వైదిక, నాట్య విధులు తెలిసినవాడు.

**3. నృత్తము ప్రదర్శించే సందర్భాలేమిటి?**

**జ.** నృత్తమును ఎప్పుడెప్పుడు ప్రదర్శించాలో జాయన తన నృత్తరత్నావళి మొదటి అధ్యాయంలో పేర్కొన్నాడు. యజ్ఞం జరిగినపుడు, పెండ్లి వేడుకలలోను, రాజు పట్టాభిషేకంనాడు, చక్రవర్తి నగరంలో ప్రవేశించేటప్పుడు, గృహప్రవేశవేళ, వ్రతము జరిగినప్పుడు, జలక్రీడలాడునప్పుడు, గొప్ప దానములు, చేసే సందర్భంలోనూ, సంతానం కలిగినప్పుడు, తీర్థయాత్రలకు బయలుదేరే వేళ, విద్యా పరీక్షల ముగింపు, యుద్ధ విజయం, దేవాలయ ప్రతిష్ఠలు, ప్రియమైనవారు కలిసినప్పుడు, దేవపూజ ఇలాంటి సందర్భాలలో తప్పక నృత్తమును ప్రదర్శించేవారు.

**4. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారి జీవిత విశేషాలు వ్రాయండి?**

**జ.** అనంతపురం జిల్లా రాళ్లపల్లిలో జన్మించిన అనంతకృష్ణ శర్మగారు సంప్రదాయ పద్ధతిలో సంస్కృతం, తెలుగు అభ్యసించారు. మైసూరు మహారాజా కళాశాలలో తెలుగు పండితునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన వీరు బహుభాషాకోవిదులు. సంగీత, సాహిత్యాలలోనూ మంచి విమర్శకులు. హాలుడు వ్రాసిన ప్రాకృత “గాధాసప్తశతి”ని, కాళిదాసు వ్రాసిన సంస్కృత “రఘువంశా”న్ని, జాయన వ్రాసిన “నృత్తరత్నావళి”ని తెలుగులోనికి చక్కగా అనువాదాలు చేశారు. తెలుగులో “సారస్వతాలోకము’ సంస్కృతంలో స్పర్థా కావ్యం, కన్నడంలో జీవనముత్తుకలే వీరి ప్రసిద్ధ రచనలు. తిరుమల తిరుపతి దేవస్థానం వారికోరిక మీద అన్నమాచార్యుల సంకీర్తనలకు కొన్నాళ్ళు స్వర కల్పన చేశారు. తెలుగు సాహిత్యంపై వీరుచేసిన ఉపన్యాసాలు, వ్రాసిన వ్యాసాలు పుస్తకాలుగా వెలువడ్డాయి. వీరు రాష్ట్ర, కేంద్ర సంగీత నాటక అకాడమీల సభ్యులుగా సేవలందించారు.

## III. ఏక వాక్య సమాధాన రూప ప్రశ్నలు

**1. జాయసేనాపతి వ్రాసిన ప్రసిద్ధ గ్రంథం పేరేమిటి?**

జ. నృత్తరత్నావళి.

**2. జాయప్పకు నాయంకరంగా ఇవ్వబడిన ఊరు ఏది?**

జ. చేబ్రోలు

**3. జాయన అక్కల పేర్లేమిటి ?**

జ. నారమ్మ, పేరమ్మ.

**4. సంస్కృతంలో తొలి నాట్య శాస్త్రం ఎవరు వ్రాశారు?**

జ. భరతముని.

**5. నందికేశ్వరుడు పేరుతో ఉన్న గ్రంథం ఏమిటి?**

జ. అభినయ దర్పణం.

# 3 - సి.పి బ్రౌన్

**- జానుమద్ది హనుమచ్ఛాస్త్రి**

## I. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. సి.పి బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవను వివరించండి?**

**జ.** ఉద్యోగరీత్యా కలకత్తా పట్టణంలో నివశిస్తున్న ఆంగ్లేయ దంపతులకు జన్మించిన సి.పి. బ్రౌన్ చదువుపూర్తయ్యాక ఈస్ట్ఇండియా కంపెనీ ఉద్యోగిగా మద్రాసు చేరుకున్నాడు. ఉమ్మడి మద్రాసురాష్ట్రంలోని తెలుగు ప్రాంతంలో పని చేయవలసిందిగా ప్రభుత్వం ఆదేశించింది. నిబంధనల ప్రకారం స్థానికులభాష తెలుగు నేర్చుకోవలసి ఉంది. వెలగపూడి కోదండ రామపంతులు వద్ద తెలుగులో ఓనమాలు దిద్దుకున్న బ్రౌను 16 నెలల్లోనే మంచి ప్రావీణ్యం సంపాదించాడు. కడప, మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, రాజమహేంద్రవరం, తిరునల్వేలి మొ॥ చోట్ల ఉద్యోగం చేశారు. ఎక్కడకు వెళ్ళినా స్థానిక తెలుగు పండితులను ఆహ్వానించి వారివద్దనున్న తాళపత్రాలు, వ్రాత ప్రతులు సేకరించేవాడు. తన సొంతడబ్బుతో వ్రాయసగాండ్రను పెట్టి వాటికి పరిష్కరణలు, శుద్ధప్రతులు తయారుచేయించేవారు. ఆంధ్రమహాభారతం, భాగవతం బ్రౌను చలువ వల్లనే పుస్తకాల రూపంలో అచ్చయ్యాయి. వేమన గురించి విని, ఆయన పద్యాలు సేకరించారు. ఆంగ్లంలోనికి అనువాదం చేయించి ముద్రించాడు.

ప్రజలనోళ్ళలో ఎప్పటినుండో నానుతున్న జాతీయాలు, సామెతలు, గాథలెన్నింటినో బ్రౌన్ దొర సేకరించాడు. తెలుగు నేర్చుకోదలచిన ఆంగ్లేయులకోసం వ్యాకరణం, వాచకాలు తయారు చేశారు. నేటికీ ప్రామాణికంగా భావించబడుతున్న తెనుగు - ఇంగ్లీషు, ఇంగ్లీషు - తెనుగు" నిఘంటువులు రాశాడు. అనంతపురం చరిత్ర, తాతాచారికథలు, పంచతంత్ర కథలు ఇలా చాలా సేకరించి ముద్రించాడు. కడపలో తన నివాసభవనాన్ని తెలుగు సాహిత్య కార్యశాలగా మార్చిన బ్రౌన్ దొర లండన్లోని "ఇండియా హౌస్ లైబ్రరి" కి తరలించబడిన అనేక తెలుగు వ్రాతప్రతులను సేకరించారు. మనుచరిత్ర, వసుచరిత్ర, కళాపూర్ణోదయం పలనాటివీర చరిత్ర మొదలగు 25 తెలుగు ప్రబంధాలను, కావ్యాలను పరిష్కరింపచేసి ప్రచురించారు. "నిలువనీడ లేకుండా పోయిన తెలుగు సరస్వతికి తన బంగళాలో పర్ణశాల నిర్మించి ఆశ్రయమిచ్చినవాడు బ్రౌన్" అన్న బం. గో. రె గారిమాట అక్షరసత్యము.

**2. సి.పి బ్రౌన్ దానధర్మాలను గురించి వివరించండి?**

**జ.** చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ దొర తెలుగు భాషాభివృద్ధికి ఎంత కృషిచేశారో, దాతృత్వంలోనూ అంతే చొరవ చూపించారు. 1821 లో కడపలో పనిచేస్తున్నపుడు తన డబ్బుతో రెండు పాఠశాలలు పెట్టించి, అందులో తెలుగు, హిందుస్థానీలలో చదువు చెప్పించాడు. మచిలీపట్నంలో ఉద్యోగం చేస్తున్నప్పుడు అక్కడ కూడా రెండు తెలుగు బడులు నిర్వహించాడు, రెండుచోట్లా విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయించిన సహృదయుడు సి.పి.

బ్రౌన్. రాయలసీమ, గుంటూరు ప్రాంతాలలో పెద్ద కరువులు వచ్చినపుడు ఎన్నో "గంజికేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజల ఆకలి తీర్చాడు బ్రౌన్ దొర.

తన వ్యక్తిగత ఖర్చులను బాగా తగ్గించుకున్న బ్రౌన్ దొర తనజీతంలో ప్రతిపైసా కూడబెట్టి, తన తెలుగు కార్యశాలలో పని చేసే పండితులకు నెలజీతాలిచ్చేవాడు. ఆయన ఉద్యోగ విరమణ చేసే నాటికి తెలుగు భాషోద్ధరణ కోసం 60వేల రూపాయల అప్పులు చేశాడు. వాటన్నింటినీ తీర్చాకే ఆయన ఇంగ్లండు వెళ్ళాడు. తన నెలజీతం 500- 600 లకు మించి లేని రోజుల్లోనే, ఆయన చేసే దానధర్మాలు ఒక్కోసారి నెలజీతంతో సమానంగా ఉండేవి. కుంటి, గుడ్డివారికి సహాయం చేయడంతోపాటు, అప్పులు చేసి జైలుపాలైన పదకొండుమంది బాధితులను 355 రూ॥ ఇచ్చి విడిపించిన ఉదారుడాయన. ఆయన ఆదాయం 600గాను వ్యయం 6వేలుగాను ఉండేది. ఇలా ఆయన ఉద్యోగం చేసిన ప్రతిచోటా ఆయన చేసిన వితరణకార్యక్రమాలు ఆయనకు శాశ్వతకీర్తిని సంపాదించిపెట్టాయి.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. సి.పి. బ్రౌన్ బాల్యం గురించి వ్రాయండి?**

**జ.** డేవిడ్ బ్రౌన్, కొలే దంపతుల రెండవ కుమారునిగా సి.పి. బ్రౌన్ కలకత్తా పట్టణంలో జన్మించాడు. తండ్రి మరణానంతరం బ్రౌన్ కుటుంబం ఇంగ్లండుకు వెళ్ళిపోయింది. అక్కడ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు తమ సంస్థలో ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారి కోసం "హెయిల్ బరీ" అనే కాలేజి స్థాపించారు. అందులో సంస్కృతం బోధించేవారు. ఆ కళాశాలలో విద్యార్థిగా చేరిన సి.పి బ్రౌన్ మంచి ఉత్తీర్ణత సాధించి "శ్రీ విద్యావరాహ" బంగారు పతకాన్ని బహుమతిగా అందుకున్నాడు.

**2. సి.పి.బ్రౌన్ ఉద్యోగజీవితం గురించి రాయండి?**

**జ.** లండనులో విద్యాభ్యాసం పూర్తయ్యాక ఈస్టిండియా కంపెనీవారు సి.పి.బ్రౌనును మద్రాసు సర్వీసులకు ఎంపిక చేయడంతో, ఆయన మద్రాసులో కంపెనీ ఉద్యోగిగా చేరారు. స్థానిక భాష అయిన తెలుగు చక్కగా నేర్చుకుని కడప, మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, రాజమహేంద్రవరం, తిరునల్వేలి మొ॥ చోట్ల ఉద్యోగాలు చేశారు. ఆయన ఎక్కడ పనిచేసినా తెలుగుభాషాభివృద్ధితోపాటు, దీనుల, అభాగ్యుల అభ్యున్నతికి కృషిచేశాడు. సెలవుల పై లండన్ వెళ్ళినప్పటికీ అక్కడ కూడా విశ్రాంతి లేకుండా ఇండియాహౌస్ లైబ్రరీలో భారతీయభాషల రాత ప్రతులు సేకరించి మద్రాసుకు పంపించేవాడు.

**3. నందన లేదా గుంటూరు కరువు గురించి రాయండి?**

**జ.** ఆంధ్రదేశంలో ధాత కరువు, నందన కరువులనే పేర్లతో 18వశ॥లో రెండు గొప్పకరువులు వచ్చి వేలాదిప్రజల మరణాలకు కారణమయ్యాయి. వర్షాలుపడక పంటపొలాలు బీడుపడ్డాయి. పశుగ్రాసం లేక లక్షలాది పశువులు మరణించాయి. తినడానికి నాలుగు మెతుకులు లేక వేలాదిగా జనం చనిపోయారు. ఇందులో నందన లేదా గుంటూరు కరువును చూసి

చలించిపోయిన బ్రౌను దొర ఈస్టిండియా కంపెనీ వారికి ఘాటుగా లేఖ వ్రాశాడు. కంపెనీనుండి ఎలాంటి స్పందనా రాలేదు. చేసేది లేక బ్రౌన్ దొరే స్వయంగా రంగంలోనికి దిగి గుంటూరు ప్రాంతంలో ఎన్నో గంజి కేంద్రాలు ఏర్పాటుచేసి కొంతమేర ప్రజలను ఆదుకున్నాడు.

4. **జానుమద్ది హనుమచ్ఛాస్త్రి గారి గురించి వ్రాయండి?**

**జ.** అనంతపురంజిల్లా రాయదర్గంలో జన్మించిన హనుమచ్ఛాస్త్రిగారు విద్యాభ్యాసం పూర్తయ్యక బళ్ళారిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. వివిధ వార్తాపత్రికలలో 2500కు పైగా వ్యాసాలు వ్రాసిన ఆయన తెలుగు, ఇంగ్లీషులలో చాలాపుస్తకాలు వ్రాశారు. సి.పి. బ్రౌన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, బళ్ళారి రాఘవ వంటి ప్రసిద్ధుల జీవిత చరిత్రలు వ్రాశారు. కడపలో సి.పి. బ్రౌనుపై వీరు చేసిన పరిశోధనలను మెచ్చుకుంటూ సి.నా.రే వీరిని "బ్రౌనుశాస్త్రి" అని ముద్దుగా పిలిచేవారు. వీరు సాహిత్య కృషికి అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, అనంతపురం లలితకళాపరిషత్తు అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభాపురస్కారం వంటివెన్నో లభించాయి. కడప రచయితల సంఘానికి నాలుగు దశాబ్దాలపాటు సారధ్యం వహించారు.

## III. ఏకవాక్యరూప సమాధాన ప్రశ్నలు

1. **సి.పి. బ్రౌన్ పాఠ్యభాగ రచయిత ఎవరు?**

జ. జానుమద్ది హనుమచ్ఛాస్త్రి

2. **జానుమద్ది తల్లిదండ్రులు ఎవరు?**

జ. జానకమ్మ, సుబ్బన్న

3. **జానుమద్దిని "బ్రౌన్ శాస్త్రి" అని ముద్దుగా ఎవరు పిలిచేవారు?**

జ. సింగిరెడ్డి నారాయణరెడ్డి (సి.నా.రె)

4. **ఆంధ్రభాషోద్ధారకుడు ఎవరు?**

జ. సి.పి.బ్రౌను

5. **హిందు మేనర్స్ కస్టమ్స్ అండ్ సెర్మనీస్ గ్రంధకర్త ఎవరు?**

జ. అబేదుబాయ్

6. **రాయలసీమను కృంగదీసిన కరువులు ఏవి?**

జ. నందన కరువు, ధాతకరువులు

7. **తెనుగు - ఇంగ్లీషు,ఇంగ్లీషు - తెనుగు నిఘంటువులను కూర్చినది ఎవరు?**

జ. సి.పి.బ్రౌను

# 4. జానపదకళలు

- మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. మిక్కిలినేని తెలిపిన మూడు జానపద కళారూపాలను వివరించండి.**

**జ.** ఆంధ్ర దేశం నలుమూలలా ఎన్నో జనపద కళా రూపాలు నేటికీ ప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. వాటిల్లో మూడింటి గురించి తెలుసుకుందాము.

**1. హరి హరీపదాలు :** ఉత్తరాంధ్రలో నేటికీ సజీవంగా ఉన్న ప్రముఖ కళారూపమిది. హరి హరీ నారాయణా! ఆది నారాయణా! కరుణించు మమ్మేలు కమల లోచనుడా! అంటూ భక్తిపారవశ్యంతో పాటలుపాడుతూ నృత్యాలుచేస్తారు. గంగా పరమేశ్వరుల వివాహం, సారంగధర చరిత్రలాంటివి కూడా వీరు ఆడిపాడతారు. వాటిని జంపెలని కూడా అంటారు. రామచంద్ర రాజు, సన్యాసిరాజు, చంద్రగిరి తాతయ్యలాంటి కవులు, సామాన్య ప్రజలు పరమాత్మను సేవించడం కోసం హరిహరీ పదాలు వ్రాసి ప్రచారంలోనికి తెచ్చారు.

**2. బుట్టబొమ్మలు:** కొన్నేళ్ళ క్రితం వరకు పెండ్లి ఊరేగింపులలో, దేవుని కళ్యాణోత్సవాలలోనూ తప్పనిసరిగా ఈ బుట్టబొమ్మల ప్రదర్శన ఉండేది. వెదురు తడికలతో తమకు కావలసిన దేవతల మానవ, జంతురూపాలను తయారు చేసి వాటికి చింతపిక్కల గుజ్జుపూసి, ఆరబెట్టేవారు. అందంగా రంగులు వేసేవారు. మైసూరు దసరాఉత్సవాలలో ప్రదర్శించే బుట్టబొమ్మలను చూచి వచ్చిన మల్లయ్య అనే కళాకారుడు తెలుగువారికి ఈకళను పరిచయం చేశాడు. వీటిల్లో శింగి, సింగడు లాంటి హాస్యపాత్రల బొమ్మలు కూడా ఉంటాయి.

**3. గంగిరెద్దుల మేళం:** సంక్రాంతి పర్వదినాలలో "గంగి రెద్దుల మేళం" దర్శనమిస్తూ ఉంటుంది. గంగి రెద్దులవారు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కూడా ఉన్నారు. వయసులో ఉన్న కోడె గిత్తల్ని నెలలపాటు మచ్చిక చేసుకుంటారు. వాద్యాలకు అనుగుణంగా అడుగులు వేయించటం, పరుగెత్తించటం, పడుకోబెట్టడం, అటూ ఇటూ దొర్లించటం, నృత్యం చేయించటం, కొన్ని ప్రశ్నలు వేసి వాటికి సమాధానంగా తల ఊపించటం వంటి ఎన్నో విద్యలు నేర్పిస్తారు. గంగిరెద్దులను రకరకాల బట్టలతో అలంకరిస్తారు. కాళ్ళకు గజ్జెలు కడతారు. ఈ గంగిరెద్దుల మేళంలో డోలు, సన్నాయి బూర, చేతిలో కంచు జేగంట ఉంటాయి. గంగిరెద్దులను 'బసవేశ్వరుడి' గా భావిస్తారు.

**2. ఉరుముల నృత్యం, హరిదాసుల గురించి వివరించండి.**

**జ.** మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు రచించిన తెలుగువారి జానపద కళారూపాలు గ్రంథం నుండి ప్రస్తుత మన పాఠ్య భాగం " జానపదకళలు" గ్రహింపబడినది. జనపదం అంటే

పల్లెటూరు. జనపదంలో నివశించే వారే “జానపదులు”. వారికి సంబంధించిన కళలే “జానపదకళారూపాలు”.

1. **ఉరుముల నృత్యం** : ఈ నృత్యం ప్రధానంగా అమ్మవారి జాతరలలో ప్రదర్శిస్తారు. తలకు రుమాళ్లు చుట్టుకుని, మెడలో కాసులదండలు ధరించి, ఎర్రని - పచ్చని రంగు శాలువాలు కప్పుకొని, నిలువు అంగీలు ధరిస్తారు. పల్ల వేరు చెట్టు కర్రతో తయారుచేసిన ఉరుములకు చర్మపు మూతలు మూసి, కదరపుల్లలతో వాయిస్తారు. దీనిధ్వని ఉరుముశబ్దమును పోలి ఉండటం వలన దీనికి " ఉరుముల నృత్యం " అని పేరు పెట్టి ఉండ వచ్చును. ఒకచేత వీరణం యొక్క చర్మాన్ని పేము పుల్లతో రాస్తూ శబ్దాలును సృష్టిస్తారు. వీరిఇష్ట దైవం శ్రీశైలమల్లన్న. అనంతపురం జిల్లాలో ఈ వృత్తిని నమ్ముకుంటూ 70 కుటుంబాలవారు ఉన్నారు. వీరు మాలకులమునకు చెందినవారు. వీరిని "ఉరుములోళ్ళు" అనికూడా అంటారు.
2. **హరిదాసులు :** సంక్రాంతి పర్వదినాలలో, ధనుర్మాసం నెలరోజులూ “హరిదాసులు" ఇంటింటికీ తిరుగుతూ భక్తిపాటలు పాడతారు. కాషాయం లేదా పసుపురంగు వస్త్రాలు ధరించి, నుదుటిన తిరునామం దిద్దుకుంటారు, మెడలో తులసిమాలలు, చేతిలో చిడతలు, భుజం మీద తంబుర, తలమీద అక్షయపాత్ర ధరిస్తారు. కాళ్ళకు గజ్జెలు కట్టుకుని 'హరిలో రంగహరి" "శ్రీమద్రమారమణ గోవిందహరి" అని అంటూ బియ్యం, కానుకలు గ్రహిస్తారు. సిరిసంపదలతో వర్ధిల్లాలని దీవిస్తారు. హరిదాసుల అక్షయపాత్రలో బియ్యం వేసేందుకు పిల్లలు, పెద్దలు పోటీపడతారు.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. మిక్కిలినేని జీవిత విశేషాలను తెల్పండి.**

**జ.** మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి గారు స్వాతంత్ర్య సమరయోధులు, చలనచిత్ర నటులు, రచయిత, పరిశోధకులు. వీరు 1916లో గుంటూరు జిల్లా లింగాయపాలెంలో జన్మించారు. ప్రజానాట్యమండలి వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. వీరు బుర్రకథ, హరికథ, జముకుల కథ, వీధినాటకం, కోలాటం మొదలగుకళారూప ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

**వీరి రచనలు**

(1) ఆంధ్ర నాటక రంగ చరిత్ర (2) నటరత్నాలు

(3) తెలుగువారి జానపదకళారూపాలు (4) ప్రజాపోరాటాల రంగస్థలం

(5) తెలుగువారి చలన చిత్రకళ

వీరి "నటరత్నాలు" కు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. జానపద నాటకరంగాలకు వీరు చేసిన కృషికి ఆంధ్రవిశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ", ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు "తెలుగువెలుగు” అవార్డును, సంగీత నాటక అకాడమీ వారు "కళాప్రవీణ" బిరుదులను ఇచ్చి సత్కరించారు.

**2. జట్టి జాము గురించి రాయండి.**

**జ.** ఇది ఆంధ్ర దేశంలో రాయలసీమలో మాత్రమే కనిపించే కళారూపం. ఇది తాళ ప్రధాన కళ. దీనిలో చేతులు చరుస్తూ చప్పట్లు కొట్టడం వంటివి ఉంటాయి. నిటారుగా నిలబడి ఉభయ పార్శ్వాల్లో ఒకసారికుడిపక్కకు, ఒకసారి ఎడమపక్కకకు ఒరగా తిరుగుతారు. ఆయా వైపులు ఉండేవారి అరచేతుల్ని చేతులతో తడుతూ పాడుతూ ఈ ఆటను ప్రదర్శిస్తారు. కాలుకదపకుండా ఉన్నచోటే జట్టి జామును చేయవచ్చు. ఇది పూర్తిగా స్త్రీల ఆట. నలుగురుకానీ, అంతకు ఎక్కువైతే సరిసంఖ్యలలో గాని పాల్గొంటారు. రెండు జట్లుగా ఉంటారు. ఒక జట్టువారు పాటలో ఒక పాదాన్ని పాడితే, రెండవ జట్టువారు వంతపాడుతారు.

**3. ఘటంచిందు గురించి వివరించండి.**

**జ.** గ్రామీణ ప్రాంతాల్లో దేవతామూర్తుల జాతరలు, కొలుపులు జరిగేటప్పుడు ఈ ఘటం చిందు ప్రదర్శించేవారు. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు ప్రాంతాలలో ఒకప్పుడు ఈ నృత్యం (చిందు) విరివిగా చేసేవారు. దీనికెలాంటి శాస్త్రీయతా లేదు. గ్రామానికి చెందిన రజకులు ఈ ఘటాన్ని ఎత్తుకుని డప్పుల మోతలకు అనుగుణంగా లయబద్ధంగా చిందులు వేస్తారు. పంబలవారు సన్నాయి, డోలు, కనక తప్పెట్లు మోగిస్తూ ఉండగా ఘటాన్ని ఎత్తుకున్నవ్యక్తి ఉద్రేకంగా వీరంగమాడతాడు". ఈ ఘటానికి నిండుగా పసుపు బొట్లు పెట్టి, వేపాకుతోరణం చుడతారు. ఘటం ఇంటింటికీ తిరుగుతుంది. ఈ ఘటాన్ని సాధారణంగా మట్టితోనో, కంచుతోనుతయారుచేసేవారు.

## III ఏకవాక్యరూప సమాధాన ప్రశ్నలు

**1. "గంగిరెద్దుల మేళం" గురించి శ్రీనాథుడు ఏ గ్రంథంలో పేర్కొన్నాడు?**

జ. పలనాటి వీరచరిత్ర

**2. హరిదాసులు ప్రధానంగా ఏ పర్వదినాలలో కనిపిస్తారు?**

జ. సంక్రాంతి

**3. "బుట్టబొమ్మలు" కళను ఆంధ్రదేశానికి పరిచయం చేసినవారెవరు?**

జ. కట్టా మల్లయ్య

**4. హరిహరీ పదాలకు మారుపేరేమిటి?**

జ. జంపెలు

**5. "జానపదులు" అంటే ఎవరు ?**

జ. పల్లెటూరి ప్రజలు

# 5. దొంగ ఎవడు? దొర ఎవడు?

- **తాపీ ధర్మారావు**

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. అనాగరపు రోజులలో మానవసామూహిక జీవన విధానం ఎలాంటిది?**

**జ.** మన కంటికి కనిపిస్తున్న ఈ ప్రపంచమంతా భగవంతుని చేత కల్పించబడిందని కొందరు భావిస్తే, ఇది ప్రకృతిలో ఒక భాగమని మరికొందరు భావిస్తారు. మొదటి నుండి జంతువులలో పేద, ధనిక భేదాలు లేవు. అన్ని జంతువులకూ ప్రకృతి సంపద మీద సమాన హక్కులున్నాయి. ఆదిమ సమాజంలో మనుషులు కూడా ఇలాగే ఉండేవారు. పాత, క్రొత్త రాతియుగాలు, ఇనుము, కంచు యుగాలలో కూడా మనుషుల్లో పేద, ధనిక భేదాలు లేవు, మనం గొప్పదిగా చెప్పుకుంటున్న నాగరకత పుట్టిన తరువాతే ఈ భేదాలు ప్రారంభమయ్యాయి. ఇది ప్రకృతి విరుద్ధమైనదిగా మనం భావించాలి. ఈ తారతమ్యం అంతా భగవంతుడు చేసిందీకాదు, ప్రకృతిచేసిందీకాదు. దీనికి మూలకారణం మానవులలోని దుర్మార్గపు ఆలోచనలు.

మానవుడు వేటాడి పొట్టపోసుకునేరోజుల్లో ఒకడు ఒక జంతువును చంపినా అందరూ పంచుకు తినేవారు. పదిమంది పదిజంతువులను చంపినా అందరూ పంచుకునేవారు. కుంటి, గుడ్డి, బలహీనుడు, శిశువు అన్న తేడా ఆనాడు లేదు. దొరికింది అందరూ సమానంగా పంచుకు తినడమే వారికి తెలిసిన న్యాయం. చెట్టు దులిపినా, చేపలు పట్టినా కీర్తి ఒకడికేదక్కేది. అనుభవించే అధికారం మాత్రం అందరిది. దీనికి విరుద్ధంగా ఎవరన్నా ప్రవర్తిస్తే మిగతా వాళ్ళంతా అలాంటి స్వార్థపరుణ్ణి వెంటనే చంపేసేవారు. ప్రకృతిలో దొరికేది ఏదయినా అది ఏ ఒక్కరిదీ కాదు, సంఘానిది. ఈ విధంగా అనాగరపు రోజుల్లో మానవ సామూహిక జీవనం ఉండేది.

**2. మానవ స్వార్థ స్వభావాన్ని వివరించండి?**

**జ.** మానవ స్వార్థం ప్రకృతిలో సహజ జీవన సూత్రాలన్నింటినీ పాడు చేసింది. స్వలాభం ముఖ్యమనుకున్నవారు, మొండివారు, ముష్కరులు పెద్దవారయ్యారు. నోరులేనివారంతా లేనివారయ్యారు. చరిత్రలో చాలామంది రాజుల జీవితాలను పరిశీలిస్తే వారెంత పరాక్రమవంతులైనా, సమర్థులైన నాయకులైనా తమ చుట్టూ ఉన్న వారితో హాయిగా కలిసిఉండేవారు. వారు తిన్న జొన్నరొట్టే తామూ తినేవారు. వారు పడుకున్న కటికనేల మీదే తామూ పడుకునేవారు. యుద్ధంలో దొరికినదంతా అందరూ సమానంగా పంచుకునేవారు. విశేషంగా సంపద లభించినప్పుడు సమాజమంతటికీ పనికి వచ్చే పనులకోసం వాడుకునేవారు. న్యాయం, ధర్మం ప్రకారం ఇవ్వవలసినది ఇచ్చి, పుచ్చుకోవలసినది పుచ్చుకున్నన్ని రోజులు లోకంలో అసమానతలు రానే రాలేదు. ఈ న్యాయం అంతరించిన నాటినుండే దేశంలో ఎంతో మంది ధనికులున్నా దారిద్ర్యం మాత్రం తప్పడం లేదు.

ప్రకృతిలో సహజ సంపదలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకున్న కొందరు మానవులు స్వతంత్రంగా జీవిస్తున్న తమ తోటివారిమీదే పెత్తనం చేయడం మొదలుపెట్టారు. వారిది వారికే ఇస్తూ తాము దాతలమని, ధర్మాత్ములమని పొగిడించుకుంటున్నారు. ఏ పనికి ఎంత ప్రతిఫలం ఇవ్వాలన్న విషయంలో నాగరకమానవుడు విచక్షణకోల్పోయాడు. నెలంతా కష్టపడి పాఠాలు చెప్పిన పంతులుగారికి ఒక్కరూపాయి ఇస్తాడు. తనకు చిన్న సహాయం చేసిన బంట్రోతుకు 3రూ॥ ఇస్తాడు. క్షణకాలం సుఖానికి వేలరూ॥ వెచ్చిస్తాడు. రేయింబవళ్ళు కష్టపడేవారికి ఆచి తూచి ఇస్తాడు. ఆకుకూరలు కొనేటప్పుడు బేరాలాడతాడు. పట్టుచీరలు కొనేటప్పుడు ధారాళంగా ఇస్తాడు. పారిశ్రామికరంగంలో లాభాలు గడించినవారు, లాటరీ టిక్కెట్లతో బాగుపడినవారు ఇదంతా తమ కష్టార్జితం అనుకుంటున్నారు. మరోప్రక్క చమటోడ్చిన కష్టజీవులు ఒక్కపూట భోజనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు.

## II. సంక్షిప్తరూప సమాధాన ప్రశ్నలు

**1. దొర స్వభావాన్ని వివరించండి?**

**జ.** పూర్వం దొర (లేదా) రాజు తన సహచర సైనికులు, ప్రజలతో కలిసి మెలసి ఉండేవాడు. వారు తిన్నదే తింటూ, వారితో కలిసి పడుకునేవాడు. యుద్ధంలో దొరికింది అందరూ పంచుకునేవారు. అలెగ్జాండరు లాంటి నాయకుడు దండయాత్రలు చేసినపుడు ప్రతిభటునికీ తగినట్లు గొప్ప, గొప్ప పారితోషకాలిచ్చేవాడు. పేరు, ప్రతిష్ఠలు తనకు లభించినా లాభం మాత్రం అందరికీ పంచేవాడు.

**2. మానవుని దుబారా, పిసినారితత్త్వాలను తెలుపండి?**

**జ.** ఎక్కడ ఖర్చుపెట్టాలో, ఎక్కడ పొదుపు చేయాలో తెలియని స్థితికి నేటి మానవుడు దిగజారిపోయాడు. నెలంతా చదువుచెప్పిన ఉపాధ్యాయునికి ఒక రూపాయి ఇస్తూ, తనకు చిన్న సహాయం చేసిన బంట్రోతుకు మాత్రం 3రూ॥ బక్షీసు ఇస్తాడు. క్షణికమైన ఆనందాల కోసం వందలు ఖర్చుచేస్తూ, రాత్రీపగలు కష్టపడేవారికి ప్రతిపైసా లెక్కపెట్టి ఇస్తాడు. కరివేపాకు కొనడానికి బేరాలాడుతూ, పట్టుచీరలు కొనడానికి మాత్రం వేలకువేలు వెచ్చిస్తాడు. వేడుకలకోసం ఎంతో దుబారాచేసే మనుషులు, వీధిలో అడుక్కునేవారికి ఒక్కపైసా కూడా ఇవ్వరు.

**3. తాపీధర్మరావుగారి గురించి రాయండి?**

**జ.** ఒడిస్సారాష్ట్రం బరంపురంలో జన్మించిన తాపీధర్మారావు గారు ఉన్నత విద్యాభ్యాసం తర్వాత "వేగు చుక్క గ్రంథమాల"ను స్థాపించారు. కొండెగాడు, జనవాణి, కాగడా మొదలైన పత్రికలు నడిపారు. తొలినాళ్ళలో గ్రాంధిక భాషావాదిగా ఉన్న తాపీవారు రాను రాను వ్యవహార భాషకు జైకొట్టారు. అభ్యుదయ రచయితల సంఘం తొలిసమావేశాలకు అధ్యక్షత వహించారు. పాతపాళి-కొత్తపాళి,పెళ్లి- దాని పుట్టుపూర్వోత్తరాలు, ఆలిండియా అడుక్కుతినేవాళ్ళ మహాసభ, సాహిత్యమొర్మరాలు మొదలగు రచనలు చేశారు, 'రాలూ - రప్పలు" అనే ఆత్మకథ రాసుకున్నారు. చేమకూర వెంకటకవి వ్రాసిన "విజయ విలాసమనే" కావ్యానికి వీరు రాసిన "హృదయోల్లాస వ్యాఖ్యానం" పండితుల ప్రశంసలందుకున్నది.

## III. ఏకవాక్యరూప సమాధాన ప్రశ్నలు

**1. బక్షీసు అంటే అర్థం ఏమిటి?**

**జ.** సంతోషంగా ఇచ్చేది.

**2. తాపీధర్మారావుగారి ఆత్మకథ పేరు ఏమిటి?**

**జ.** రాలూ - రప్పలు

**3. ఎంతమంది ధనికులున్నా దేశానికి ఏది తప్పడం లేదు?**

**జ.** దారిద్ర్యం తప్పడం లేదు.

# 1. గౌరవస్థానం
## (ఉపవాచకము)

- కనుపర్తి వరలక్ష్మమ్మ

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. గౌరవస్థానం కథాసారాంశం ఏమిటి?**

**జ.** "కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు" నుండి "గౌరవస్థానం" అను ఈ కథను గ్రహించారు. రేడియోలో వచ్చిన ప్రసంగంగురించి రాఘవరావు, రాజేశ్వరి దంపతుల మధ్య చర్చ మొదలయింది. ఆ ప్రసంగంలో ఒక పండితురాలు భారతరాజ్యాంగ చట్టములో స్త్రీలకు పురుషులతో సమానంగా లభించిన హక్కులు, బాధ్యతలను చక్కగా వివరించింది. రాజేశ్వరి తన భర్తతో "మావన్నీ కాగితం మీద హక్కులే, చట్టాలు చేసినా, శాసనాలు చేసినా స్త్రీకి మాత్రం సమాజంలో గౌరవస్థానం దక్కడం లేదు! పదవిలో ఉన్న ఏ పదిమందో ఆ పదవి ఉన్న నాలుగురోజులు గౌరవించబనంత మాత్రాన స్త్రీకి మర్యాద దక్కినట్లుకాదు. "స్త్రీ" అనే వ్యక్తికే గౌరవం రావాలి" అని తన అభిప్రాయాన్ని చెబుతుంది. "మీరు కోరిన సమానహక్కులు వచ్చాయి కదా" అన్న భర్తతో రాజేశ్వరి "మన దేశంలో స్త్రీల కష్టాలు చట్టానికి బద్ధంకానివి, శాసనాలకు లొంగనివి. వీటిని రాజశాసనాలు కూడా పరిష్కారంచేయలేవు, అంతేకాదు ఆధునికులు రాసిన చాలా రచనల్లో స్త్రీని చులకనగా చూస్తున్నారు" అని చెబుతుంది.

రాఘవరావు తనభార్యతో "నూతన రాజ్యాంగ చట్టాల ప్రకారం స్త్రీకి చదువుకునేందుకు, ఉద్యోగాలు చేసేందుకు, చట్టసభల్లో ప్రవేశించేందుకు అధికారాలు ఇచ్చారు కదా!" అని అంటాడు. అందుకు ఆమె "ఎన్నిహక్కులు వచ్చినా స్త్రీ, పురుషుల మధ్య యజమాని-బానిస అనే భావం అలాగే ఉంది. భార్య వ్యక్తిత్వాన్ని గౌరవించడంలేదు. నిరంకుశ ప్రవర్తనతో తన అధికారాన్ని పురుషుడు చెలాయిస్తూనే ఉన్నాడు. సమానత్వభావన మచ్చుకైనా కనపడదు. స్త్రీకి ఆర్థిక స్వావలంబన లేదు. అందువల్ల స్వయంవ్యక్తిత్వం కూడా లేదు. ఎప్పుడైతే స్త్రీ ప్రతీ అవసరానికి పురుషుడు పై ఆధారపడిందో అప్పుడే ఆమె బతుకు తేలికయిపోయింది" అని విశ్లేషించింది.

రాజేశ్వరి తన భర్తతో "స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించాలి. పురుషునితో సమానంగా మిత్రవాత్సల్యంతో స్త్రీని కూడా గౌరవించాలి. అప్పుడే స్త్రీ, పురుషులిరువురికీ సుఖం కలుగుతుంది. దేశం అభివృద్ధిలోకి వస్తుంది. కుటుంబాల్లో శాంతి భద్రతలు చేకూరితే దేశానికి శాంతి భద్రతలు చేకూరతాయి" అని వివరించింది. ఈ విధంగా సమాజంలో స్త్రీకి గౌరవస్థానం ఉండాలని, స్త్రీమూర్తికి ప్రాధాన్యత దక్కాలని తెలియచేయటమే ఈ పాఠ్యభాగఉద్దేశ్యం.

**2. రాజేశ్వరి స్త్రీలకు ఏవిధమైన గౌరవస్థానం దక్కాలని కోరుకుంది?**

**జ.** "కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు" నుండి "గౌరవస్థానం" అను ఈ కథను గ్రహించారు. రేడియోలో వచ్చిన ప్రసంగం గురించి రాఘవరావు, రాజేశ్వరి దంపతుల మధ్య చర్చ మొదలయింది. ఆ ప్రసంగంలో ఒకపండితురాలు భారతరాజ్యాంగ చట్టంలో స్త్రీలకు పురుషులతో సమానంగా లభించిన హక్కులు, బాధ్యతలను చక్కగా వివరించింది. అప్పుడు రాజేశ్వరి తన భర్తతో "మనదేశంలో స్త్రీలకు ఎన్నిచట్టాలు చేసినా, శాసనాలు చేసినా గౌరవస్థానం దక్కడం లేదు. ఆధునికులు రాసిన చాలా రచనలలో స్త్రీలను చులకనగా చూస్తున్నారు" అని చెబుతుంది.

రాఘవరావు తన భార్యతో "నూతన రాజ్యాంగ చట్టం ప్రకారం స్త్రీకి చదువుకునేందుకు, ఉద్యోగాలు చేసేందుకు, చట్టసభల్లో ప్రవేశించేందుకు అధికారాలు ఇచ్చారు కదా!" అని అంటాడు. అందుకు ఆమె "ఎన్నిహక్కులు వచ్చినా, స్త్రీపురుషుల మధ్య యజమాని-బానిస అనే భావం అలానే ఉంది. భార్యను పుట్టింటికి పంపించి ఏవేవో కానుకలు తెమ్మనడం, మరలా వివాహాలు చేసుకోవడం వంటివి పురుషాహంకారానికి చిహ్నాలుగా ఉన్నాయి. ఆమె సలహాలు పాటించకుండా నిరంకుశంగా ప్రవర్తిస్తున్నాడు. స్త్రీ కూడా మనిషేనని, ఆమెకూ హృదయము, తెలివితేటలు, యుక్తాయుక్త పరిజ్ఞానము ఉన్నదని గుర్తించడం లేదు. సమానత్వ భావన మచ్చుకైనా కనపడటంలేదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేక స్త్రీ ఎప్పుడైతే ఒకరిపై ఆధారపడి ఉన్నదో అప్పుడే ఆమె బ్రతుకు తేలికైపోయింది" అని వివరించింది.

"స్త్రీలకు సమాజంలో సమున్నత గౌరవస్థానం లభించాలంటే మొదటిగా స్త్రీకి స్వయపోషణశక్తి ఉండాలి. పురుషుడు కూడా స్త్రీని తనతో సమానంగా గౌరవించాలి. మిత్రురాలిగా చూడాలి. అప్పుడే సమాజంలో స్త్రీలకు ఉన్నతమైన గౌరవస్థానం దక్కుతుంది" అని రాజేశ్వరి అభిప్రాయపడింది.

# 2. ఉరి

- విశ్వనాథ సత్యనారాయణ

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. "ఉరి" కథలో సామాన్యుడి వేదన ఎటువంటిది ?**

**జ.** కవిసామ్రాట్, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత శ్రీ విశ్వనాథసత్యన్నారాయణ "ఉరి" అనే కథను రచించారు.

"ఉరి" కథలో నాయకుడు అత్యంత సామాన్యుడు. కుటుంబాన్ని పోషించలేక సతమతమవుతున్న కడు పేదవాడు. చేసేందుకు పని దొరకక, ఉండేందుకు సరైన గూడులేక, పిల్లల ఆకలి కేకలు చూడలేకపోయేవాడు. మోసంచేయటం చేతకాక తన కష్టంతోనే కుటుంబాన్ని నెట్టుకు రావాలని భావించే సాదాసీదా వ్యక్తి.

ఎలాగో కష్టపడి నాలుగు రూపాయిలు సంపాదించి పిల్లల ఆకలి తీర్చాలని భావిస్తాడు. పొయ్యిలోకి కట్టెల కోసం వెతికాడు. ఎందుకూ పని చేయని, ఎవరికీ పనికిరాని పుల్లలను ఏరితెస్తూ ఉంటే, ఒకాయన కర్రతో కొట్టిన దెబ్బలను మౌనంగా భరిస్తాడు. ఇంటికి చేరుకున్న తర్వాత తన ఇంటిని చూసి తానే నవ్వుకుంటాడు. ఎవరిదోపడిపోయిన గోడ పక్కన తడవకుండా ఉండేందుకు కొన్ని కర్రలు సహాయంతో తాత్కలికంగా ఏర్పాటు చేసిన గూడది.

ఒక రోజు మధ్యాహ్నం జనం గుంపులుగుంపులుగా బియ్యం కోసం వెళ్తున్నారు. మన సామాన్యుడు కూడా వారిని అనుసరించాడు. రెండువందల మంది జనం ఒక చోట గుమిగూడారు. అంతా గందరగోళంగా ఉంది.ఆ గుంపుకు, అక్కడకు చేరిన రక్షకభటులకు దెబ్బలాట జరుగుతోందని గ్రహించాడు. గుంపులోని వారెవరో రక్షకభటులపైకి విసిరిన రాళ్ళలో ఒకరాయి తగిలి ఒక రక్షకభటుడు మరణించాడు. "రాయి తగిలితే చచ్చి, తుపాకీగుండు తగిలితే బ్రతుకుతాడా? రాయి తగిలి చస్తే శిక్షపడుతుంది. తుపాకి గుండు తగిలి చస్తే శిక్షలేదు. ఇదేమిటో?" అని సామాన్యుడు ఆవేదనచెందుతాడు. అక్కడిగుంపును రక్షకభటులు తరిమారు. అందరూ పారిపోయారు. తిండిలేక నీరసించిన సామాన్యుడు పరిగెత్తలేకపోయాడు. రక్షకభటుని లాఠీ దెబ్బతిని స్పృహకోల్పోయాడు. మెలకువ వచ్చిన తర్వాత తాను జైలులో ఉన్నానని తెలుసుకున్నాడు. రాయి విసిరిన నేరం మోపి సామాన్యుడికి ఉరిశిక్ష విధించారు.

అపుడు సామాన్యుడు "నేను మనిషిని చంపానని మీరు ఉరిశిక్షవేశారు. చంపానన్నది నాకు, మీకు, ఎవరికీ తెలీదు, సాక్ష్యమూలేదు. నాకు తల్లీ, భార్యాపిల్లలు ఉన్నారు. వారికి తిండిపెట్టలేక చాలా బాధపడ్డాను. మీ దయవల్ల నాకు రెండునెలల నుండి రెండుపూటలా అన్నందొరికింది. నా గతం కూడా యిలాగే సాగితే బాగుండేది. నా భార్యాపిల్లలు ఏమయిపోయారో నాకు తెలియదు. నాకు ఒక్కటే చింతగా ఉంది. నా పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయి, చివరి రోజుల్లో వాళ్ళకు కూడా నాకు పట్టిన జైలు యోగం పడుతుందా?" అని వేదన పడ్డాడు.

# 3. గాలివాన

**- అడవి. బాపిరాజు**

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. గాలివాన కథాసారాంశాన్ని వివరించండి?**

**జ.** బహుముఖ ప్రజ్ఞాశాలి అడవిబాపిరాజు రచించిన "రాగమాలిక" అనే సంపుటి నుండి "గాలివాన" కథ స్వీకరించబడింది. కష్టకాలంలో ధైర్యంగా ఎలా వ్యవహరించాలో కామేశ్వరి పాత్ర ద్వారా రచయిత తెలియచేశారు. విశాఖపట్టణం జిల్లాలో కారుపల్లె అనే గ్రామం ఉంది. ఆ ఊళ్ళో అప్పలస్వామి అనే పెద్ద రైతు ఉన్నాడు. అతడి కూతురు కామేశ్వరిని చిన్నతనాన అందరూ కామమ్మ అని పిలుచుకునేవారు. సముద్రంలో వాయుగుండం పడి తుఫానుగా మారి ఊళ్ళ మీద పడడంతో కారుపల్లె తీవ్రంగా దెబ్బతింది. ప్రళయం వచ్చినట్లుగా ఇళ్ళూ, వాకిళ్ళు కొట్టుకుపోయాయి. ఊరి జనం కట్టుబట్టలతో మిగలడం చూసిన అప్పలస్వామి తన ధాన్యపు గాదె తలుపులు తెరచి గుండిగలనిండా (పెద్ద ఇత్తడిబిందె) అన్నం వండించాడు. కూరలు, పులుసులు సిద్ధంచేయించాడు. ఊరంతా కదలివచ్చి భోజనాలు చేసి వెళుతున్నారు. రోజులు గడిచినకొద్దీ సరుకులు అయిపోయాయి. ఇంట్లో నగలు, వెండిసామానులు సైతం కుదువపెట్టి మరీ అప్పలస్వామి జనం ఆకలి తీరుస్తున్నాడు. ఈ నేపథ్యంలో విజయనగరం మహారాజా కళాశాలలో చదువుకుంటున్న కామేశ్వరి కారుపల్లె వచ్చింది.

అప్పలస్వామి చేస్తున్న అన్నదాన కార్యక్రమానికి అండగానిలబడిన కామేశ్వరి తన స్నేహితులందరికీ ఉత్తరాలు రాసింది. తన ఒంటిమీద నగలమ్మి తండ్రికిచ్చింది. విజయనగరం వెళ్ళి గొప్పవాళ్ళు, వదాన్యులను అడిగి డబ్బు తీసుకురావాలన్న ఆలోచనతో టిక్కెట్టు కొనకుండానే రైలుఎక్కి బయలుదేరింది. అందాల బరిణ కామేశ్వరి రైల్లో టికెట్ కలెక్టరు కంట్లో పడింది. అతడు మాయమాటలు చెప్పి తనకు విజయనగరం దివాను తెలుసని చెప్పి కామమ్మను నమ్మించాడు. విజయనగరంలో దిగగానే ఒక గుఱ్ఱపుబండి కట్టించి ఊరి చివర నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్ళాడు. కామేశ్వరికి ఆ క్షణాన "పాలులేక ఏడుస్తున్న పిల్లలు, సర్వస్వం కోల్పోయిన రైతులే" కనిపించారు. వెంటనే ఆ రాక్షసుడిపై ఎదురు తిరిగి పట్టు విడిపించుకొని పరుగెత్తింది. కొంత సేపటికి ఆమెకు కారులో వస్తున్న దివానుగారు ఎదురయ్యాడు. కామేశ్వరిని చూసి వివరాలు అడిగి తెలుసుకొని ఆమెను రక్షించాడు.

**2. కామేశ్వరి పాత్ర స్వభావాన్ని వివరించండి?**

**జ.** అడవిబాపిరాజు గారు బుర్రకథ బాణీలో పాడుకోవడానికి వీలుగా వ్రాసిన కథ ఇది. కారుపల్లె అనే గ్రామంలో అప్పలస్వామి అనే పెద్దరైతు ఉండేవాడు. అతడి కూతురు కామేశ్వరి. ఆమె అందాలబరిణ, అనురాగాలపోగు. అప్పలస్వామి పెద్దరైతుఅవ్వడం చేత ఇంటివద్దకే పంతులు గారిని పిలిపించి ఆమెకు చదువు చెప్పించాడు. కామేశ్వరి కమ్మగా పాడగలదు. ఆ పాటను గోవులు, పక్షులు కూడా ఆలకిస్తాయని జనం చెప్పుకునేవారు. కామేశ్వరి పెద్ద

చదువుల కోసం అప్పలస్వామి ఆమెను విజయనగరం మహారాజా కళాశాలలో చేర్పించాడు. అక్కడే చక్కగా చదువుకుంటున్న కామేశ్వరి తుఫానుదెబ్బకు తమ ఊరంతా సర్వనాశనం అయిపోయిందని విని పరుగున ఇంటికి వచ్చింది. అప్పటికే ఆమెతండ్రి తనవద్ద ఉన్నదంతా అమ్మి, దొరికిన చోట్ల అప్పులు తెచ్చి "అన్నమో రామచంద్రా!" అని ఏడుస్తున్న దీనుల ఆకలి తీరుస్తున్నాడు. కామమ్మ అన్ని విషయల్లోనూ తండ్రిపోలికే. తన తోటి ప్రజల బాధలు చూసి చలించిపోయింది. తన ఒంటిమీద నగలమ్మి వచ్చిన 2వేల రూపాయలను తండ్రికిచ్చింది. అవికూడా కొద్ది రోజుల అవసరాలకే సరిపోయాయి.

కామేశ్వరి తన స్నేహితులందరికీ ఉత్తరాలు రాసింది. మనమంతా కలిసి ఒక సంఘంగా ఏర్పడి పెద్దఎత్తున సహాయకార్యక్రమాలు చేపట్టాలని ఆహ్వానించింది. సభలు పెట్టి చందాలు వసూలు చేయమంది. చివరకు తానే విజయనగరంవెళ్ళి అక్కడి పెద్దలను కలిసి తగిన సహాయం పొందాలని నిర్ణయించుకుంది. తానొస్తున్నానని దివానుగారికి ఉత్తరం రాసింది. అనుకున్నదే తడువుగా టిక్కెట్టు కొనకుండానే రైలు ఎక్కేసింది. రైల్లో టికెట్ కలెక్టరు పరిచయమయ్యాడు. కామేశ్వరి ఎందుకు బయలుదేరిందో తెలుసుకున్నాడు. నగరంలో పెద్దలంతా తనకు పరిచయస్తులన్నాడు. ఆక్షణాన కామమ్మకతడు ఆపద్బాంధవుడిలాగా కనిపించాడు. అతడి మాటవిని రైలు దిగగానే గుర్రపుబండి ఎక్కి అతడితో ప్రయాణమయ్యింది. ఊరు దాటాక టికెట్ కలెక్టరు రాక్షసుడిలాగా ప్రవర్తించేటప్పటికి కామేశ్వరికి మూర్ఛవచ్చినంతపనైంది. అంతటి విపత్కర పరిస్థితులలో కూడా కామమ్మకు "బక్కచిక్కిన రైతులు, పాలుకోసం ఏడుస్తున్న పిల్లలు, చేతులు చాచిన దీనులు" కళ్ళముందు కదిలారు. వారికోసమైనా నేనిక్కడ నుండి బయటపడాలని టికెట్ కలెక్టర్ పై తిరగబడింది. చెంపపై లెంపకాయ కొట్టి లేడిలాగా పరుగెత్తింది. దారిలో కారులో వస్తున్న దివానుగారికి ఎదురవ్వడంతో రక్షించబడింది.

# 4. వాన కురిస్తే

**- కేతు. విశ్వనాధరెడ్డి**

## I వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. అవినీతి మార్గంలో డబ్బు సంపాదించే వారి తీరును, అప్పులు తీర్చే విషయంలో పాపయ్య ఆలోచనా తీరును వివరించండి?**

**జ.** రాయలసీమ కథా రచయితలలో ప్రముఖులైన కేతు విశ్వనాధరెడ్డిగారు వ్రాసిన కథ "వానకురిస్తే".

వర్షానికి - రైతుకు ఎంత అవినాభావ సంబంధం ఉందో, రాయలసీమలో నీటికి ఎంత ప్రాధాన్యత ఉందో ఈ కథ తెలియ చేస్తుంది. ఈ కథ పాపయ్య అనే రైతుచుట్టూ తిరుగుతుంది. పాపయ్య అభిమానధనుడైన రైతు. ప్రాణంకన్నా మాటకు విలువిచ్చేవాడు. ఆయనున్న ఊళ్ళోనే రామిరెడ్డి అనే వడ్డీవ్యాపారస్తుడు రైతులకు ఎక్కువ వడ్డీలకు అప్పులిచ్చి అక్రమంగా ధనం సంపాదించేవాడు. దొంగ సర్టిఫికేట్ అమ్మేవాడు. ఇతరత్రా అనేక తప్పుడుపనులు చేసి డబ్బు కూడబెట్టేవాడు. వ్యవసాయానికి ఉపయోగపడే చెఱువు త్రవ్వించడానికి ప్రభుత్వం ఇచ్చిన 5 లక్షల రూ॥ను అధికారులు దారిమళ్ళించడంతో ఎంతవాన కురిసినా ఆ ఊరి చెఱువులో నీళ్ళుమాత్రం నిలబడవు కావు. ఇలా గ్రామస్థాయి నుండి జాతీయస్థాయి వరకు అవినీతి జరిగి, దేశమంతా నాశనమవుతూ ఉంది అని రైతుపాపయ్య ఆవేదన చెందేవాడు.

పాపయ్యది తరతరాలుగా వ్యవసాయ కుటుంబం. పాపయ్య తండ్రికూడా సేద్యంలో పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. అన్ని బాకీలు తీర్చాకే మరణించాడు. ఆయన 10 ఎకరాల పొలం అమ్మి వడ్డీతో సహా అప్పులన్నీ తీర్చాడు. ఇంత నిక్కచ్చిగా బాకీలు తీర్చేవాళ్ళు చాలా అరుదు. అప్పులు చేసిన కొందరు ఆస్తులన్నీ దగ్గరి బంధువుల పేరపెట్టి, దొంగబాండులు పుట్టించి, చివరికి అప్పు ఎగ్గొట్టేస్తారు. పాపయ్య మాత్రం "ఆస్తి పోతేపోయింది, తన కుంటుంబం యొక్క పరువు, ప్రతిష్ఠ నిలిబడింది చాలు" అనుకునేవాడు. "చచ్చిపోతూ ఋణం ఉంచుకోకూడదు - అందులోనూ బంధువుల దగ్గర" అని చెప్పిన తన తండ్రిమాటను గుర్తుచేసుకునేవాడు పాపయ్య.

**2. "వాన కురిస్తే" కథ ఆధారంగా రైతు జీవితాన్ని వివరించండి?**

**జ.** ప్రసిద్ధ కథారచయిత కేతు విశ్వనాధరెడ్డి 'వానకురిస్తే' కథ ద్వారా రైతుజీవితం అందునా రాయలసీమలో రైతు జీవితం ఎన్ని కష్టాలు, కడగండ్లతో నిండి ఉంటుందో వివరించారు. రాయలసీమలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారం మీద ఆధారపడి వుంటుంది. సకాలంలో వర్షాలు పడి చెఱువులు నిండితే రైతులకు నాలుగు రూపాయలు దక్కుతాయి. కుటుంబ ఖర్చుల కోసం, వ్యవసాయ బోర్లు వేయిచడంకోసం రైతులు అధిక వడ్డీకి వేలకు వేలు అప్పులు తెచ్చేవారు. ముహుర్తాలు పెట్టించి, అప్పుచేసి మరీ బోరింగు వేయించాక నీళ్ళు పడకపోతే

రైతులకు కన్నీళ్ళే మిగులుతాయి. మిరప, శనగ, నిమ్మ, జొన్న, పత్తి లాంటి పంటలకోసం రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడితే సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండి పోయేవి. ఈ కథలో 3 తరాల రైతులు కనిపిస్తారు. ప్రతి తరం అప్పులతో పుట్టి, అప్పులతో సహవాసం చేస్తూ కనిపిస్తారు.

నేలతల్లిని నమ్ముకుని, ప్రాణంతో సమానంగా పెంచిన పంట చేతికందిరాక రైతులు విలవిలలాడుతుంటే, వారిని నిలువుగా దోచుకు తినే అంగడి రామిరెడ్డి లాంటి వడ్డీ వ్యాపారులుండేవారు. రైతంటే అందరికీ అలుసే. రేడియోలో వాతావరణశాఖ చెప్పినా, పంచాంగంలో రాసిఉన్నా, ఆకాశమంతా ఉరుముతున్నా ఒక్క చినుకైనా నేలమీదరాలదు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు బంధుప్రీతికి, అవినీతికి లొంగి వ్యవసాయానికి ఉపయోగపడే పనులన్నింటినీ నాసిరకంగా చేసేవారు. కష్టాల ఊబిలో చిక్కుకున్న రైతులు పగలంతా ఆకాశంలో మేఘాలవైపు ఆశగా చూస్తూండేవారు. రాత్రిపూట పెద్ద వాన పడి చెఱువులు నిండి, కాలువలు పారుతున్నట్లు, పంటలు పండి బాకీలన్నీ తీర్చినట్లు కలలు కనేవారు.

# 5. మహామనిషి రతన్ టాటా

**పాఠ్యగ్రంథ రచయితలు**

## I. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

**1. రతన్ టాటా భారతీయులకు చేసిన సేవలను వివరించండి?**

**జ.** భారతీయ సంపన్న వ్యాపార సామ్రాజ్యం నుండి వచ్చిన రతన్ టాటా 1991 వ సం||లో జె.ఆర్.డి టాటా నుండి టాటా సన్స్ సంస్థ పగ్గాలు అందుకున్నారు. వ్యాపార సామ్రాజ్యంలో చక్రవర్తిగా ఎదిగిన టాటా గొప్ప మానవతావాది. టాటా గ్రూపు ఆదాయంలో 66% సంపదను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం ప్రశంసనీయం.

కరోనావైరస్ కారణంగా ఆర్థిక వ్యవస్థ మందగించినప్పుడు 1500 కోట్ల రూపాయిలు దానం చేసిన అపర దానకర్ణుడు రతన్ టాటా. భారతీయ పేద కుటుంబానికి చవకైన ధరలో కారును అందుబాటులో ఉంచాలని 'నానో'కి శ్రీకారం చుట్టి, లక్షరూపాయిలకే అందించి 'ఇండియన్ హెన్రీఫోర్డ్'గా ఖ్యాతి పొందారు. కొందరు ఉగ్రవాదులు 2008లో ముంబైలోని తాజ్ హోటల్లోనికి ప్రవేశించి 31 మంది సిబ్బందితో పాటు అతిథులను పొట్టనబెట్టుకున్నారు. ఆ సమయంలో రతన్ టాటా వారిని అన్ని విధాలుగా ఆదుకున్నారు.

ఉదారతకు మారుపేరైన రతన్ టాటా అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయంలో చదివే భారతీయ విద్యార్థుల సంక్షేమానికి 2.8 కోట్ల డాలర్లతో ఉపకారవేతన నిధిని ఏర్పాటు చేసారు. 2010 సం||లో హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కు 5 కోట్ల డాలర్ల సహాయం అందించారు.

తన వీలునామాలో సైతం మానవీయ కోణాన్ని విడనాడలేదు. రతన్ టాటా తనకున్న 3,800 కోట్ల రూపాయిల ఆస్తిలో ఎక్కువభాగాన్ని రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్టులకు కేటాయించారు. తన పెంపుడు శునకాలకు సైతం 12లక్షలు కేటాయించి మూగజీవలపట్ల తనకున్న ప్రేమను చాటి చెప్పారు. రతన్ టాటా భారతీయులకు చేసిన సేవలు ఎన్నో తరాలపాటు మనకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

**2. రతన్ టాటా వ్యాపారాన్ని ఏవిధంగా అభివృద్ధి చేశారు?**

**జ.** భారతీయ సంపన్న వ్యాపారకుటుంబాలలో టాటా కుటుంబం పేరెన్నికగన్నది. సుదీర్ఘ నాయకత్వం, ఘనచరిత్ర కలిగిన జె.ఆర్.డి. టాటా తర్వాత 1991 లో వ్యాపారపగ్గాలు చేపట్టిన రతన్ టాటా అంచనాలను మించి ప్రపంచవ్యాప్తంగా టాటా సంస్థల ప్రతిష్ఠను ఇనుమడింపచేశారు. బాధ్యతలు చేపట్టిన కొత్తలో టాటాగ్రూప్ లోని కొంతమంది సీనియర్ అధికారులు సరైన సహకారం అందించనప్పటికీ ఓర్పు, నేర్పుతో వ్యవహరించి పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకున్నారు.

1962లో అమెరికాలో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న తర్వాత భారతదేశానికి వచ్చిన రతన్ టాటా జంషెడ్ పూర్ లోని స్టీల్ కర్మాగారంలో సాధారణ కార్మికునిగా యూనిఫామ్ ధరించి పనిచేశారు. ఈ అనుభవం క్షేత్రస్థాయి ఉద్యోగుల సాధకబాధకాలుతెలుసుకునేందుకు

ఉపకరించింది. బ్రిటీష్ స్టీల్ కంపెనీ, డచ్ స్టీల్ కంపెనీలు రెండూ కలిసి 1999లో “కోరస్” అనే పేరుతో ఒక సంస్థగా ఏర్పడ్డాయి. కొన్ని కారణాల వల్ల యాజమాన్యం ఈ సంస్థను అమ్మకానికి పెట్టింది. వేలంలో 42,000 మంది ఉద్యోగులు ఉన్న ఈ సంస్థను టాటా గ్రూప్ చేజిక్కించుకుంది. 32 బిలియన్ డాలర్ల నికరాదాయంతో ప్రపంచంలోనే ప్రధాన ఉక్కు సంస్థలలో 5వ స్థానంలో టాటాగ్రూప్ నిలిచింది.

భారతీయ పేదకుటుంబానికి చవకైన ధరలో కారుని అందుబాటులో ఉంచాలని “నానో”కి శ్రీకారం చుట్టి లక్షరూపాయిలకే అందించి 'ఇండియన్ హెన్రీఫోర్డ్' గా ఖ్యాతి పొందారు. అవమానించిన ఫోర్డ్ కంపెనీ అధినేత బిల్ ఫోర్డ్ ను కష్టసమయంలో ఆదుకున్న మానవీయ వ్యాపారవేత్త రతన్ టాటా. ఫోర్డ్ దిగ్గజ బ్రాండ్లు అయిన జాగ్వార్, ల్యాండ్ రోవర్లను టాటా గ్రూప్ 2.3 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకుంది.

రతన్ టాటా ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించే నాటికి 10వేల కోట్ల నికరాదాయం ఉన్న టాటాగ్రూప్ ఆదాయం 2012 వ సం॥ పదవీ విరమణ చేసేనాటికి 100 బిలియన్ డాలర్లకు చేరింది. కోరస్ మరియు టాటా స్టీల్ కలిసి 50 దేశాల్లో 80వేల మంది ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ విధంగా విశ్వవ్యాపార వినీలాకాశంలో రతన్ టాటా ఒక ధ్రువ తారలాగా నిలబడ్డారు.

## సంధులు

### అత్త్వ సంధి

1. **సూత్రం:** "అత్తునకు సంధి బహుళముగానగు”

**ఉదా :** 1. గ్రుచ్చిన + అట్లే = గ్రుచ్చినట్లే

*2. వేడక + ఎల్ల = వేడుకెల్ల

అత్తు అంటే హ్రస్వమైన 'అ'కారం. బహుళం అంటే సంధి అనేక రూపాలలో (నాలుగు రూపాలుగా) జరగటం.అని అర్థము.

1) **ప్రవృత్తి :** సంధి తప్పనిసరిగా జరగడం (నిత్యం)

**ఉదా :** రామ + అయ్య = రామయ్య

2) **అప్రవృత్తి :** సంధి తప్పనిసరిగా జరగకపోవడం

**ఉదా :** దూత + ఇతడు = దూతయితడు

3) **వైకల్పికం** / విభాష : సంధి జరగవచ్చు, జరగకపోవడం

**ఉదా :** వేడుక + ఎల్ల = వేడుకెల్ల/వేడుకయెల్ల

4) **అన్యకార్యం :** జరగవలసిన వ్యాకరణ కార్యానికి బదులుగా మరొకటి జరగడం

**ఉదా :** ఒక + ఒక = ఒకానొక

2. **ఇత్వ సంధి**

**సూత్రం :** ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికముగానగు.

**ఉదా :** *ఏమి + అంటివి = ఏమంటివి; ఏమియంటివి

ఇత్తు అంటే హ్రస్వమైన 'ఇ' కారం. ఏమ్యాదులు అంటే ఏమి, ఏది, అది, ఇది, అవి, ఇవి, మరి... వైకల్పికం అంటే సంధి జరిగితే ఒక రూపం, జరగకపోతే మరొక రూపం రావడం

3. **ఉత్వ సంధి**

**సూత్రం :** ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు

**ఉదా :** నీకు + ఎల్లవారు = నీకెల్లవారు

కన్నీరు + ఒలికిన = కన్నీరొలికిన

పందెము + ఒడ్డెద = పందెమొడ్డెద

దొంగలకు + ఇత్తురు = దొంగలకిత్తురు

4. **యడాగమ సంధి**

**సూత్రం :** సంధి లేని చోట స్వరంబుకంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు.

**ఉదా :** మా + ఊరు = మాయూరు

మా + ఇల్లు = మాయిల్లు

5. **గ స డ ద వాదేశ సంధి**

**సూత్రం :** ప్రథమము మీది పరుషములకు గ,స,డ,ద,వ లు బహుళముగానగు.

**ఉదా :** ఏమి + చేయుదు = ఏమిసేయుదు

కడుపు +చొచ్చినను = కడుపుసొచ్చినను

6. **టుగాగమ సంధి**

**సూత్రం :** కర్మధారయ సమాసంలో ఉత్తునకు అచ్చుపరమైనపుడు టుగాగమంబగు

**ఉదా :** *నిలుపు + అద్దము = నిలుపుటద్దము

*సరసపు + అలుక = సరసపుటలుక

పల్లె + ఊరు = పల్లెటూరు

వలుపు + అంగడి = వలపుటంగడి

**సూత్రం :** కర్మధారయమునందు పేర్వాది శబ్దములకు అచ్చుపరమైనపుడు టుగాగమం వైకల్పికంబగు.

**ఉదా :** *చిగురు + ఆకు = చిగురాకు, చిగురుటాకు

*పొదరు + ఇల్లు = పొదరిల్లు, పొదరుటిల్లు

**వివరణ :** i) "టు" గాగమం అంటే "ట్" అనే వర్ణం ఆగమంగా రావడం.

ii) పేర్వాది శబ్దములు అంటే పేరు, చిగురు, పొదరు మొదలయిన పదములు

7. **సరళాదేశ సంధి**

**సూత్రం :** i) ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగు

**ఉదా :** ప్రజలన్ + కాచుచు = ప్రజలఁగాచుచు

**సూత్రం :** ii) ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషలు విభాషనగు

**ఉదా :** నేలన్ + పడి = నేలంబడి, నేలఁబడి, నేలన్బడి.

## సమాసాలు

వేరువేరు అర్థాలు కలిగిన రెండు పదాలు కలిసి ఒకే అర్థవంతమైన పదంగా ఏర్పడితే దానిని 'సమాసం' అంటారు. దీనినే చిన్నయసూరి బాలవ్యాకరణంలో 'సమర్థంబులగు పదంబు లేకపదంబగుట సమాసంబు' అని నిర్వచించారు.

**ఉదా :** 'రామ', 'బాణము' అనేవి రెండు వేరు వేరు పదాలు. వాటికి వేరువేరు అర్థాలున్నాయి. ఈ రెండు పదాలు కలిసి 'రామబాణము' అనే సమాసం ఏర్పడింది.

**విగ్రహవాక్యం :** రెండు పదాలను సమాసంగా చేసినపుడు ఆ సమాసాల మధ్య లోపించిన విభక్తి ప్రత్యయాలను చేర్చి సమాసం యొక్క అర్థాన్ని వివరించడాన్ని 'విగ్రహవాక్యం' అంటారు.

**ఉదా :** రామబాణము - రాముని యొక్క బాణము అనేది విగ్రహ వాక్యం.

**పూర్వపదం :** సమాసంలోని మొదటి పదాన్ని 'పూర్వపదం' అంటారు

**ఉదా :** 'రామబాణము' అనే సమాసంలో 'రామ' అనేది పూర్వపదం.

**ఉత్తరపదం :** సమాసంలోని రెండవ పదాన్ని 'ఉత్తరపదం లేదా పరపదం' అంటారు.

**ఉదా :** 'రామబాణము' అనే సమాసంలో 'బాణము' అనేది ఉత్తరపదం

### తత్పురుషం

ఉత్తర పదార్థ ప్రధానంగా గల సమాసం తత్పురుషం. అంటే సమాసంలోని రెండవ పదానికి ప్రాధాన్యం ఉంటుంది. ఇది వ్యధికరణం, సమానాధికరణం అని రెండు రకాలు.

## 1. వ్యధికరణం

విభక్తులు ఆధారములుగా కలదానిని వ్యధికరణము అంటారు. ద్వితీయా విభక్తి మొదలుకొని సప్తమీ విభక్తి వరకు గల అర్ధవంతమైన పదాలు గల సమాసమే వ్యధికరణ సమాసం.

### (అ) ప్రథమా తత్పురుష సమాసం

**వివరణ:** దీనిలో మొదటి పదం ప్రథమా విభక్తిలో ఉంటుంది. సమాసం పూర్తి కాగానే లోపిస్తుంది.

**ఉదా** 1. నడిసముద్రం = ***సముద్రము నడుమభాగం***

2. అర్ధరాజ్యము = ***రాజ్యము అర్ధభాగము***

***(పాఠ్యపుస్తకంలో ని వీటి విగ్రహవాక్యాలలో సముద్రపు, రాజ్యపు అని 'ము' కు బదులుగా 'పు' ముద్రించబడినది.)***

### (ఆ) ద్వితీయా తత్పురుష సమాసం

**వివరణ:** దీనిలో మొదటి పదం చివర 'నిన్, నున్, లన్, గూర్చి, గురించి' అనే విభక్తి ప్రత్యయాలు చేరతాయి.

**ఉదా:** సేతుబంధనం = సేతువును నిర్మించడం

### (ఇ) తృతీయా తత్పురుష సమాసం

**వివరణ:** దీనిలో మొదటి పదం చివర 'చేతన్, చేన్, తోడన్, తోన్, అనే విభక్తి ప్రత్యయాలు చేరతాయి.

**ఉదా:** 1. అద్దాల మేడ = అద్దాలతో మేడ

2. భక్తిసాధ్యులు = భక్తి చేత సాధ్యులు

### (ఈ) చతుర్థీ తత్పురుష సమాసం

**వివరణ:** దీనిలో మొదటి పదం చివర 'కొఱకున్,కై' అనే విభక్తి ప్రత్యయాలు చేరతాయి.

**ఉదా: 1.** సీతాన్వేషణ = సీత కొరకు అన్వేషణ

2. విశ్వశాంతి = విశ్వం కొరకు శాంతి

### (ఉ) పంచమీ తత్పురుష సమాసం

**వివరణ:** దీనిలో మొదటి పదం చివర 'వలనన్, కంటెన్, పట్టి' ప్రత్యయాలు చేరతాయి.

**ఉదా: 1.** స్ఫోటనరవం = స్ఫోటన వలన రవం

2. ఆనందభాష్పాలు = ఆనందం వలన భాష్పాలు

**(ఊ) షష్ఠీ తత్పురుష సమాసం**

**వివరణ:** దీనిలో మొదటి పదం చివర 'కిన్, కున్, యొక్క, లోన్, లోపల, అనే విభక్తి ప్రత్యయాలు చేరతాయి.

**ఉదా: 1.** శంఖధ్వానము = శంఖము యొక్క ధ్వానము

2. రాజశాసనము = రాజు యొక్క శాసనము

3. తల్లిమాటలు = తల్లి యొక్క మాటలు

4. శిరోవేదన = శిరస్సునకు వేదన

5. కపినాథుడు = కపులకు నాథుడు

**(ఋ) సప్తమీ తత్పురుష సమాసం**

**వివరణ:** దీనిలో మొదటి పదం చివర 'అందున్, నన్, అనే విభక్తి ప్రత్యయాలు చేరతాయి.

**ఉదా:** 1. వనవాసి = వనము నందు వసించువాడు

2. మాటనేర్పరి = మాట యందు నేర్పరి

**(ౠ) నఞ తత్పురుష సమాసం**

**వివరణ:** విగ్రహవాక్యం 'కానిది, లేనిది, అనే వ్యతిరేక అర్థాన్ని బోధిస్తే నఞతత్పురుష సమాసం అంటారు.

**ఉదా: 1.** అహింస = హింస కానిది

2. అలఘుడు = తక్కువ కాని వాడు, లఘువు కానివాడు

3. నిర్దయుడు = దయలేనివాడు

## పదదోషాలు

భాషా నైపుణ్యాలు నాలుగు 1. శ్రవణం 2. భాషణం 3. పఠనం 4. లేఖనం. భాషా నైపుణ్యాలలో చివరిది, క్లిష్టమైంది లేఖనం. రాసేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలి. పదదోషాలు లేకుండా రాయాలి. రాసేటప్పుడు అచ్చులకు బదులు హల్లులు, హల్లులకు బదులు అచ్చులు రాయడం అక్కడక్కడా కనిపిస్తుంది. అలాగే మహాప్రాణాలకు బదులు అల్పప్రాణాలు, అల్పప్రాణాలకు బదులు మహాప్రాణాలు రాయడం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల అర్థంలో మార్పు వస్తుందని గ్రహించాలి. ఇటువంటి దోషాలను సరిచేసుకొని లేఖన సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలి.

**అల్పప్రాణాలకు బదులు మహాప్రాణాలు రాయడం**

| **సాధు రూపాలు (ఒప్పులు)** | | **అసాధు రూపాలు (తప్పులు)** |
|---|---|---|
| 1. మల్లికార్జున | - | మల్లిఖార్జున |
| 2. కచ్చితము | - | ఖచ్చితము (ఈ రెండింటిని సాధు రూపాలుగా కొందరు కవులు ప్రయోగించారు.) |
| 3. విద్యార్థి | - | విధ్యార్థి |
| 4. శాకాహారము | - | శాఖాహారము |
| 5. శంకుస్థాపన | - | శంఖుస్థాపన |

*****************

**అధ్యాపకులకు, విద్యార్థులకు మేలుకలిగించే తెలుగు కరదీపికను ముద్రించిన ఇంటర్మీడియట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్ వారికి ధన్యవాదములు.**

**తే||  చెక్కుచెదరని - యేనాడు మొక్కవోని**
**ఆంధ్ర పౌరుష మిప్పుడధ్వాన్న మయ్యె**
**మరల నొకమాటు వెనుకకు మరలిచూచి**
**దిద్దుకోవమ్మ!బిడ్డల తెనుగుతల్లి! _________ కరుణశ్రీ**

*****************

**** జయీభవ ! దిగ్విజయీభవ! ****